

శ్రీబాబూజీ సాయిభక్తులవడానికి గల కారణాలను గురించి భక్తులు వారి వద్ద ఒకసారి ప్రస్తావించినపుడు, వారు, "అది చాలా సహజంగా జరిగింది. నేను చిన్నపిల్లవాడిగా ఉన్నప్పటి నుండి బాబా పట్ల ఒక అనిర్వచనీయమైన ఆకర్షణ ఉండేది, ఆయనతో ఏదో అనుబంధం ఉన్నట్లు అనిపించేది. ఇంట్లో పూజామందిరంలో అందరి దేవతలతో పాటుగా సాయిబాబా చిత్రపటం కూడా ఉండేది. నాకు మిగతాదేవతల కంటే బాబా విభిన్నంగా కనిపించేవారు. నాకు ఆయన మనలాంటి మనిషిగా, చాలా వాస్తవంగా, యదార్థంగా కనిపించేవారు. ఆయనను అలా చూస్తూ ఉండాలనిపించేది. కానీ నాకు అప్పటికి బాబా గురించి ఏమీ తెలియదు. నేను మాష్టరుగారిని (ఆచార్య శ్రీఎక్కిరాల భరద్వాజగారు) కలుసుకున్న తర్వాతే నాకు బాబా ఎవరో తెలిసింది" అని అన్నారు.



శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!
సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!





## వాత్సల్య వార్ధి

మహనీయులను దర్శించాలని, వారి సాన్నిధ్య భాగ్యం పొందాలని సాధకులైన వారెంతో తహతహలాడుతుంటారని మనం అనుకుంటూ ఉంటాము. కానీ ఇది పూర్తి సత్యం కాదు. మహనీయుల సంకల్పం లేనిదే మనం వారి దర్శన, స్పర్శన, సహవాస, సల్లాప, సంభాషణాది భాగ్యములనందలేము. "నా అనుమతి లేనిదే షిర్డీ ప్రవేశద్వారము లేదు." అన్న శ్రీసాయినాథుని వాక్కు ఎవరికి వారికి అనుభూతిలోకి వచ్చే సత్యము. వివేకానందాది శిష్యుల రాకకోసం, వారితో మాట్లాడటం కోసం శ్రీరామకృష్ణ పరమహంస మహాప్రభువు ఎంతో పరితపించే వారని మనకు గ్రంథాలు తెలియపరుస్తున్నాయి.

తనను నమ్మిన వారిని తన చెంతకు ఏదో ఒక మిషతో రప్పించుకొని వారి ఉన్నతికి బాటలు వేయడం మహనీయులు చూపేలీల. అప్పుడప్పుడు శిష్యులు మొరాయిస్తే గురువులు బిడ్డకేక విని తల్లడిల్లే తల్లులౌతారు.

# గురుకృప

విజయదశమి సంచిక

తనకంటూ ఏమీ ఉంచుకోక - ప్రేమను వర్షించినటువంటి ఒకానొక దివ్య చైతన్యానికి మనం పెట్టుకున్న పేరు 'గురువు'.



## నేనుండగా భయమేల?

భక్తుడు : "నేనిక్కడ ఉండగా భయమేల?" అని బాబా చెప్పినపుడు అది ఎంతో వ్యక్తిగతమైన మాట. అంటే భరోసా అనిపిస్తుంది.

గురువుగారు : ఒక భక్తుడు ఓ సందర్భంలో భయపడ్డప్పుడు, "నేనిక్కడ ఉండగా ఎందుకు భయపడతావు?" అన్నారు బాబా. 'ఇక్కడ' అనే మాటకు నీవెక్కడ ఉంటే 'అక్కడ' అని అర్థం. నేను నీతోనే ఉంటాను అని దానర్థం. నీవెక్కడ ఉంటే అక్కడ నిన్ను రక్షించడానికి బాబా ఉన్నారు. నేను నీతోనే ఉంటాను, ఇదీ దానర్థం. ఈ విషయాన్నే బాబా వేరే వేరే సందర్భాలలో, "నీవెక్కడకు వెళ్ళినా నేనక్కడ ఉన్నాను, నీవెక్కడ చూస్తే నేను అక్కడ ఉన్నాను" అని అన్నారు. మీ చూపు ఎక్కడ పడితే అక్కడ బాబా ఉన్నారు. బాబా పలికిన మిగతా మాటలనుబట్టి 'ఇక్కడ' అంటే ఏమిటో నిర్వచించుకోవాలి.

రమణమహర్షి విషయంలో కూడా ఇది అంతే. మీరు నిజంగా అర్థం చేసుకుంటే, "శ్రీరమణమహర్షి సంభాషణలు" గ్రంథమంతా 'ఇక్కడ' అనే పదానికి వ్యాఖ్యానమే. నేను దానిని ఒకటి రెండు మాటలలోనో, అరగంట, గంటలోనో, రెండు గంటల్లోనో చెప్పలేను. ఆయన బోధనలు, జీవితం మొత్తం ఆ మాటకు వ్యాఖ్యానమని మీరు దానిని అలా చూస్తే అర్థమవుతుంది. ఆయన, "నేను ఎక్కడికి పోగలను, నేనిక్కడే ఉన్నాను" అన్నారు. ఆలోచించండి.

భక్తుడు : సద్గురువు అన్ని చోట్లా ఉంటే, మేము మీ సాన్నిధ్యంలో ఉండటం యొక్క ప్రాముఖ్యత (విలువ) ఏమిటి?

గురువుగారు : ఇది చాలా మంచి ప్రశ్న. దీని విలువ మీ అవసరం, మీ అనుభవం మీద ఆధారపడి ఉంటుంది. మనకు కొన్ని విషయాలు కూడా చాలా విలువైనవిగా ఉంటాయి. కొన్నింటికి మన దృష్టిలో అంత విలువ ఉండదు. అది ఏదైనా సరే – మీకు ఇక్కడ ఉండటం యొక్క విలువ పట్ల స్పష్టత ఉన్నా, లేకపోయినా, దాని విలువ నాకు తెలుసు.

(మిగతా 31వ పేజీలో)



(2వ పేజీ తరువాయి)

"మీ దగ్గరకు ఎవరు వచ్చినా ఋణానుబంధంతో వస్తారు, మీరు వారిని సగౌరవంగా చూడాలి, మీ దగ్గర ఉన్న దానిని వారితో పంచుకోండి. మీ దగ్గరకు ఎవ్వరు వచ్చినా నేనే వారిని మీ వద్దకు పంపుతాను" అన్నారు బాబా. నేను దానిని అలానే చూస్తాను. ఆయన 'అతిథి' అనే పదాన్ని వాడారు. అతిథిని ఇంగ్లీషులో 'గెస్ట్' అంటారు. కానీ ఇంగ్లీషులో 'అతిథి' అనే అర్థాన్నిచ్చే సరైన పదం లేదు. ఇంగ్లీషు భాషలో గెస్ట్ అంటే ఆహ్వానంమీద, అపాయింట్‌మెంట్ మీద వస్తాడు, కానీ 'అతిథి' అంటే పిలవకుండానే, అనుకోకుండా, నిర్ణీత సమయం లేకుండా వస్తాడు. 'అతిథి' అంటే నిర్ణీతమైన (తిథి, వార, నక్షత్రాలు) సమయమంటూ లేకపోవడమని అర్థం.

ఈ 'అతిథి' అనే సూత్రాన్ని (సాంప్రదాయాన్ని) నేను తు.చ. తప్పకుండా పాటించాలనుకుంటున్నాను. నేను ఎవ్వరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వను, నేను ఎవ్వరినీ ఆహ్వానించను. ఎందుకని? దానికి కారణం పొగరు కాదు. ఒకవేళ నేను ఎవరినన్నా పిలిస్తే అది నా ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంటుంది. కానీ బాబా పంపించినపుడు వాళ్ళ బాగోగులు చూసుకోవడమన్నది ఆయన బాధ్యత. అందుకనే మీరు నా వద్దకు వచ్చినపుడు మీరు నాకు బాబా గురించి ఆలోచించడానికి అవకాశాన్ని ఇస్తున్నారని భావిస్తాను. నాకు మీరందరూ బాబా ప్రసాదం. నేను బాబా ప్రసాదాన్ని ఎలా చూస్తానో మిమ్మల్ని కూడా అలానే చూస్తాను. నా వరకు నేను, మీరు నాకేమవుతారు, దాని విలువేమిటి? అనే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాను. మీరు ఇక్కడ ఉండటం యొక్క విలువేమిటని మీరు ఆలోచించుకోవాలి.

బాబా ఎవరిని పంపుతారో వాళ్ళే ఇక్కడకు వస్తారు. అందుకే నేను ఎవరు వస్తున్నారు, ఎవరు రావడం లేదు, వాళ్ళు ఏం పొందుతున్నారు, ఏం లాభపడుతున్నారు అనే విషయాన్ని పట్టించుకోను. అది నాకు సంబంధించిన విషయం కాదు. "నేను నా వాళ్ళను రకరకాల మిషల మీద నా దగ్గరకు చేర్చుకుంటాను" అన్నారు బాబా. బహుశా ఆయనకు నేను ఒక మిష కావచ్చు.

–శ్రీబాబూజీ

మీరందరూ నాకు బాబా ప్రసాదం. పవిత్రమైన ప్రసాదం. ఈ విషయంలో నాకు చాలా స్పష్టత ఉంది. –శ్రీబాబూజీ

మీరు పరిపూర్ణులు కావాలని ఆనందంగా ఉండాలని, మీ గమ్యం చేరుకోవాలని నేను కోరుకుంటాను. –శ్రీబాబూజీ



మేఘునికి శ్రీసాయి పట్ల గల సద్భక్తి – మేఘుడు కాలం చేసిన సమయంలో శ్రీసాయి "ఇతను నా నిజమైన భక్తుడు" అని బిగ్గరగా శోకిస్తూ మేఘుని అంతిమ యాత్రలో కొంత దూరం నడిచి, పూలుచల్లి, తానే బ్రాహ్మణులకు సంతర్పణ చేయించిన వైనం గుర్తుకు రాక మానదు.

సద్భక్తుల అంతరంగం సద్గురుమయమై వారి హృదయమందిరాలలో ఆయా గురుచంద్రులు దైవంగా కొలువుతీరితే – గురువు యొక్క ప్రేమ కూడా అఖండంగా వ్యక్తమవ్వదా? ఎప్పుడైనా, ఏ క్షణమైనా ఒంటరితనం పొడచూపే వేళ మనకు 'గురువు' ఉన్నారన్న ఒక్క ఆలోచన అనంతమైన శక్తినివ్వగలదని మరవకుండటం ఉత్తమం. జన్మజన్మలకు గురువు తోడుగా నిలుస్తారంటే సందేహంగా ఉంటే మనం శివన్, మేఘశ్యాముని వృత్తాంతాలు మరల మరల పఠించాల్సిందే! ఎందుకంటే సద్విషయాలు అంత సులభంగా మన మనసులలో నాటుకుపోవు. పూజ్యగురుదేవులు శ్రీబాబూజీ ఇలా అంటారు. "తత్త్వదర్శినులైన సత్పురుషుల యొక్క ప్రత్యక్ష సన్నిధి లభించనప్పుడు, ఆ సద్గురుమూర్తుల దివ్యసన్నిధిని ప్రసాదించగలిగిన వారి జీవిత చరిత్రలు – బోధనలను శ్రద్ధతో అధ్యయనం చేసి, ఆ అధ్యయనసారాన్ని మననం చేసి, దాన్ని హృదయగతం చేసుకొనడం కూడా సత్సంగమే" అని. 'గురుకృపా' విశేషంగా పరమాచార్యస్వామి వారి చరిత్రను, బోధను అధ్యయనం చేసే అవకాశం లభించింది. మహాత్ముల చరిత్రల అధ్యయనక్రమం మనం మన గురుచంద్రుల చరణాలను సభక్తికంగా, అనన్యంగా సేవించుకునేందుకు హేతువవ్వాలి. ఆ చరణాలను చేరే క్రమంలో అడ్డుపడే అంశాలను తొలగించుకోవడానికి, గమ్యం చేరడానికి నిర్మించుకునే జ్ఞాన, భక్తి సేతువులవ్వాలి. గురుచరణమే శరణమని మన మానసాలు అవగతం చేసుకోగలగాలి. శుభం భవతు, గురుచరణ ప్రాప్తిరస్తు.

– గురుకృప

**"శిరిడీ నుండి ఎవ్వరూ వట్టి చేతులతో తిరిగి వెళ్ళరు" అనేవారు శ్రీబాబూజీ.**

శిరిడీ క్షేత్ర సందర్శనకు వచ్చిన వారిని ఆ అవకాశాన్ని, చక్కగా ఉపయోగించుకోవలసిందిగా ఎంతో ప్రోత్సహించేవారు. సాయిమందిరంలోనూ, శ్రీసాయిసన్నిధితో పునీతమైన ద్వారకామాయి, లెండీ, గురుస్థాన్ మొదలైన ప్రదేశాలలో సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని గడపమనేవారు. గురుస్థాన్ చుట్టూ ప్రదక్షిణలు, సాయి జీవితచరిత్ర, ప్రబోధాల పారాయణ – ఇలా ప్రతి క్షణం సాయిస్మరణలో ఉండమని సూచించేవారు శ్రీబాబూజీ.



సంపుటి : 24
సంచిక : 4

అక్టోబర్ 15
2021



గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

పథగామి – అక్షరాల్లో అనుభూతులు 4
శిల - శిల్పి – అనంతపుత్రుని అనంతవైభవం 9
సరిదిద్దు - సంస్కరించు – డా॥ ఎస్.సాయివరప్రసాదరావు 10
15 సద్గురు సమ్మోహనం - సాయినామ జగన్మోహనం – జగన్మోహన్ రెడ్డి
16 దర్శనం – శరచ్చంద్రికలు
26 గురుకృపాలహరి – గురుకృప



నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## పచ్చికాస్తా పండాలి

అది చినవాల్తేరు కాలనీలోని మాస్టరుగారి ఇల్లు. రాత్రి పది గంటలు దాటుతోంది. పనులన్నీ చూసుకొనివచ్చిన మాస్టరుగారు, అప్పుడే మంచం మీద కూర్చుని ప్రక్కనున్న వారితో సరసోక్తులాడుతున్నారు. ముందుగదిలో కూర్చున్న సన్నిహితులొకరు మెల్లగా మాస్టరుగారి చెంతకు చేరుకున్నారు. ఆయన మాస్టరుగారికి చాలా దగ్గరవారు. అన్నివిధాలా దగ్గరవారు. "మధ్యాహ్నం కొంత చెప్పాను గదా! అదే వాళ్ళ సంగతి వాళ్ళు ఎందుకలా ప్రవర్తిస్తున్నారో నాకు అంతుపట్టడం లేదు. నేనేం చేసాను? వాళ్ళు నమ్ముతున్న సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా విశ్లేషించాను. ఆ సిద్ధాంతానికి పునాదులు లేవు. గమ్యమూ లేదని నిరూపించాను. ఇదంతా వాళ్ళకు అర్థం కావాలనే చేసాను. అర్థం చేసుకోవలసింది పోయి వాళ్ళెందుకలా వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారు. ఆల్‌మోస్ట్ వాళ్ళు నాకు శత్రువులుగానే ప్రవర్తిస్తున్నారు. కావాలని వస్తారు నా దగ్గరకు. ఏదో మాటలు మొదలుపెడతారు. మధ్యలో అనుభూతుల ప్రసక్తి వస్తుంది. నేను పొందిన అనుభూతులు వాళ్ళకు చెబుతాను. వాళ్ళు నమ్మరే. పైగా ఆ అనుభూతులు వాళ్ళకు చూపించమంటారు-అదెలా సాధ్యం? అవి ఎవరికి వారు పొందవలసినవి కదా "ఈ మార్గాన కృషి చేయండి, మీరూ పొందుతారు అంటాను". అదంతా మాకు అనవసరం. మీకు కలిగాయి అంటున్నారు. కాబట్టి మాకూ చూపించండి. లేకపోతే మేం నమ్మం" అంటారు వాళ్ళు. వితండవాదులకు చెప్పగలిగిన వాళ్ళెవరు?

వితండవాదులకు దండిగా జవాబులు చెప్పి, మొండిగా ఎదురు తిరిగి ఎక్కడెక్కడి అంశాలో పట్టుకొచ్చి, వాళ్ళను అక్కడికక్కడే నోరు మూయించే శక్తిగల వ్యక్తి ఒకాయన ఉన్నాడని తెలిసింది. స్నేహితుల ప్రోద్బలంతో అతడిని రంగంలోనికి దింపాను. అతడు ఉద్దండుడై విజృంభించాడు. అతడి ఉపన్యాసాలు జరిగినంతకాలం ఆ నాస్తిక సమూహం వచ్చారు కానీ ఎవ్వరూ కిక్కురుమనలేదు. కొంతవరకు సంతోషమైంది. సరే ఆ ఉపన్యాసకుడికి ముట్టచెప్పగలిగినంత ముట్టచెప్పి సాగనంపారు. అతడు వెళ్ళిన మరునాడే మళ్ళీ వచ్చారు వాళ్ళు. మేము వాదించదలచుకున్నది ఆయనతో కాదండీ! మీతోనే" అన్నారు. అందుకనే మేము ఆయనతో ఘర్షణ పడలేదు, అన్నారు, కథ మళ్ళీ మొదటికి వచ్చింది. ఎందుకు వాళ్ళిలా ప్రవర్తిస్తున్నారు? ఒక రకంగా వాళ్ళు నన్ను వేధిస్తున్నారు. నేను చేసిందేమిటి? "ఇది మంచి" అని చెప్పాను. "తెలుసుకొని బాగుపడండి'' అన్నాను. వాళ్ళు ఎందుకని గ్రహించలేకపోతున్నారు. ఏం చేయాలో నాకు పాలుపోవడం లేదు. ఎందుకని ఇలా జరుగుతోంది?"





ఒక్క అరుపుతో వంటశాల వారికి నిర్దేశించేవారట. ఎంతో వంట చెరకువాడినా ఒక్కోసారి అన్నం అందరికీ సరిపడా వండటం సులభం కాదని, ఇరవై సంచులు వండిన అన్నాన్ని శుభ్రమైన చాపలపై పోసి, పైన ఒక పల్చటి వస్త్రాన్ని కప్పి దానిపై కడిగిన బియ్యాన్ని పోసి శుభ్రమైన నారపట్టాలతో గట్టిగా బిగించేసేవారు. పువ్వులా కన్పించే అన్నం అర్థగంటలో తయారుగా ఉండేది. మరి ఇన్ని వేలమందికి పెరుగు కావాలంటే - ఇప్పుడంటే డైరీలు, సమాఖ్యలు, శీతలీకరణ సామగ్రి ఉన్నాయి - మరి అప్పుడో! నెల ముందే చెక్కతో చేసిన పీపాలలో (బారెల్)తోడు పెట్టిన పెరుగును మూసివేసి మైనంతో గాలి చొరబడకుండా సీల్ చేసి ఆలయాల నీటి తటాకంలో వదిలివేసేవాడు. వారాలైనా, నెల అయినా పెరుగు చెక్కుచెదరకుండా ఉండిపోయేది. అప్పట్లోనే ప్రకృతితోనే రిఫ్రిజిరేషన్ చేసిన ఘనత వారిది. పెరుగును గట్టిగా, స్వచ్ఛంగా ఉంచింది నీటి తటాకమా! స్వచ్ఛమైన, మృదుశీలమైన వారి మనస్సా! ఏమో! సద్గురువు, సద్భక్తుని ద్వయంలోని అనంతమైన ప్రేమగా భావిద్దాం.

నడిచే శివునికి, అన్నదాన శివునికి కూడా ఒక సామ్యం ఉండేది. పరమాచార్యుల జీవిత పర్యంతం చంద్రమౌళీశ్వర సేవకు ఉపయోగించిన దంపుడు బియ్యంతో చేసిన ఆహారాన్నే స్వీకరించేవారు. ఇక అన్ని పదార్థాలతో సరే సరి. అలానే అన్నదానం అనంతరం శివన్ తనకు దగ్గరలో ఉన్న స్నేహితుని ఇంటికి వెళ్ళి పెరుగన్నాన్ని తన ఇష్టదైవమైన దక్షిణామూర్తికి నివేదించి, ఆ పెరుగన్నంతోనే భోజనం చేసేవాడు - ఒక నియమంగా. తన మౌన వాఖ్యానంతో భక్తుల సంశయాలను ఎలా తీర్చేవాడో - అటు మౌనంలోనూ, ఇటు వాక్కులోనూ, భక్తుల సంస్కారానికి, అవసరానికి అనుగుణంగా అన్ని సంశయాలను తీర్చేవారు పరమాచార్యస్వామి. ఒక్క ముక్కలో చెప్పాలంటే స్వామివారు వ్యాఖ్యా దక్షిణామూర్తి - నడయాడిన దక్షిణామూర్తి. శివన్ అంటే స్వామి వారికి చాలా ప్రేమ. గంగాయాత్ర తర్వాత మే 19వ తేదీ 1939వ సంవత్సరం స్వామివారు చోళుల నేలలో అడుగిడిన రోజునే శివన్ వారి స్వగ్రామమైన త్రిభువనంలో కాలం చేసారు. సన్యాసాశ్రమం స్వీకరించని సన్యాసి శివన్. శివన్ జీవిత చరమాంకంలో తన చేతిలో మిగిలిన నూట అరవై రూపాయలను 'బావి' త్రవ్వించడానికి (పూర్త ధర్మం) మఠానికి అప్పచెప్పాడు. స్వామివారు ఆ ధనాన్ని తిరువల్లూర్‌లోని హరిజనుల కోసం బావి త్రవ్వించడానికి ఉపయోగించమని ఆదేశించారు. శివన్ కాలం చేసారని తెలియగానే స్వామివారు 'త్రిభువనం'లోనూ, 'కుంభకోణం'లోనూ మోక్షదీపం వెలిగించమని అంతేవాసులను ఆదేశించారు.



సంప్రీతుడవుతాడు" అంటారు పూజ్యశ్రీబాబూజీ. ఈ శీర్షికలో మనం అలా అన్నదాన శివన్‌గా పిలుచుకునే శివన్ గురించి గుర్తు చేసుకుందాం. ఎందుకంటే అతను పరమాచార్యస్వామివారికి అనన్యభక్తుడు. స్వామి వారిపై మక్కువకు మేరలేదు. తమిళనాడులో లక్షలాది భక్తులకు అన్నప్రసాద వినిమయం చేసిన కూర్చు భక్తుడు శివన్. కుంభకోణం దగ్గర్లో ఒక చిన్న గ్రామంలో పేద బ్రాహ్మణ దంపతులకు జన్మించాడు శివన్. కుగ్రామం కావడంతో విద్యకు కూడా అవకాశం రాలేదు. తాను కొంతకాలం పనిచేసిన చోట తాను నేర్చుకున్నదేమంటే "ఆకలిగొన్న జీవులకు అన్నం పెట్టడం" మనుషుల ప్రాథమిక ధర్మం. చాలా చిన్న వయసులోనే తల్లిదండ్రులను, వివాహమైన కొంత సమయానికే భార్యను కోల్పోయాడు శివన్. తనకున్న చిన్న ఇంటిని, పొలాన్ని కూడా అమ్మివేసి ఆ ద్రవ్యాన్ని కూడా అన్నదానమునకే వినియోగించాడు.

లక్ష్మీ నృసింహుని ఆలయంలో తాను చేసిన ఆ కార్యక్రమంతో తృప్తిపడలేదు. వంటవానిగా పనిచేస్తూ కూడా తన స్వల్ప ఆదాయంతో, కొందరు భక్తుల సహకారంతో ఆకలితీర్చే వాకిలిగా నిలబడ్డాడు. కొంత సమయం గడిచేసరికి శివన్‌లోని 'ఇతరుల కడుపు నింపాలన్న' ఆర్తిని చూసి ఎందరో సంపన్నులు ముందుకొచ్చారు. 1897 మహామహంలో తాను సలిపిన అన్నదానయజ్ఞానికి కుంభకోణం వాసులు ఆశ్చర్యపోయారు. ఎవ్వరి వద్దా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రతీ నెల ఒక గ్రామంలో అన్నదానం చేసారు శివన్. ఇలా సుమారు ఏభై సంవత్సరాలు ఎన్నో ఉత్సవాలలో అన్నదాన కార్యక్రమం జరిగేది. 1909వ సం॥లో తనకు పదిహేను సంవత్సరాల వయసులో ఉండగా మొదటిసారి పరమాచార్య స్వామి వారిని కలిసారు శివన్. స్వామి వారికి ఒక గొప్ప అంతరంగిక భక్తునిగా మారిపోయారు శివన్. 1921వ సం॥లో స్వామివారు నిరాహారులై ఉంటున్నారని తెలిసినపుడు తండ్రి బిడ్డకు ఎలా ఉత్తరం రాస్తాడో అలా అన్ని జాగ్రత్తలు స్వామి వారితో పంచుకున్నారు. పరమాచార్యులనే పుత్రులుగా చూడడమంటే అది ఎన్ని జన్మల ప్రేమ సంబంధమో, ఋణానుబంధమో కదా! మఠం కోసం ఎందరో సంపన్నుల వద్ద విరాళాలు అభ్యర్థించడము, ప్రజోపయోగ వితరణశీల కార్యక్రమములను నిర్వహిస్తే ఆర్తులకు ఎలా ఆలంబనగా నిలుస్తామో మఠానికి సూచనలివ్వడం చేసేవారు శివన్. శివన్‌గారి అన్నదాన సమయ మెళకువలను కొన్ని చూద్దాం. వంట వండడం మొదలుపెడితే ఆ పదార్థము వాసనతోనే దూరం నుండే అందులో ఏమి తగ్గాయో చెప్పేవారట శివన్. రసం కాస్తే ఇంకా ఎంత కొత్తిమీర కలిపితే రుచిగా ఉంటుందో





ఆయన ముఖంలో ప్రశ్నార్థకం గోచరిస్తోంది. ప్రశాంతవదనులై కూర్చున్న మాస్టరుగారివైపు సమాధానం కోసం చూస్తున్నారు ఆయన. "సమాధానపరచే, సమాధానం వచ్చే చోటు ఇదీ" అని ఆయనకు తెలుసు. అందుకనే తన మనస్సులోనిదంతా మాస్టరుగారి ముందు వెళ్ళబోసుకున్నారు. చిరునవ్వు నవ్వుతూ మాస్టరుగారిలా అన్నారు. అడిగావు కాబట్టి చెబుతున్నాను. ఏమీ అనుకోవు కదూ! నీలో ఇంకా కొంత అవగాహన రావలసింది ఉంది. అదేమిటంటే నాస్తికులు అంటే నీ మనస్సులో కొంత **"ద్వేషం (విముఖత)"** ఉంది. ఆ గిట్టనితనం ఉండటంతో వాళ్ళు నీ మీద సవాళ్ళు చేయడం జరుగుతుంది. ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకో. నువ్వు వాళ్ళతో వాదిస్తున్నావా? వాళ్ళకు తెలియచెపుతున్నావా? ద్వేషభావం ఉన్నపుడు వాదిస్తాం. ప్రేమతత్వం నిండినపుడు తెలియచెపుతాం. కనుక మనలో ఆ కాస్త పచ్చి కూడా పండవలసి ఉంది. పండిననాడు వాళ్ళెవరూ నీపైన తిరగబడరు. వస్తే నీ వెంటవస్తారు లేదా వాళ్ళకు నచ్చినట్లుంటారు. నిన్ను ద్వేషించరు. ఒకరి సిద్ధాంతం మనకు నచ్చనంత మాత్రం చేత మనం వారిని ద్వేషించనక్కరలేదు. ఈ సత్యాన్ని ముందు మనం గమనించి అమలు పరచాలి. అప్పుడు క్రమంగా అవతలివాళ్ళు కూడా అమలుపరుస్తారు. సిద్ధాంతంతో నిమిత్తం లేకుండా, ఒకరినొకరు ప్రేమించుకోవటమనేది గౌరవించుకోవడమనేది అప్పుడు జరుగుతుంది.

ఇక రావలసిన మేలుకొలుపు అంటావా? కాలక్రమంలో అదే వస్తుంది. మనలో ఎలా వచ్చింది? వాళ్ళలోనూ అలాగే వస్తుంది. మన స్నేహహస్తాన్ని వారికి అందించి, వారిలో రావలసిన మేలుకొలుపుకు దోహదం చేయాలి తప్ప, వాదించి ఏం లాభం?ఆ దోహదం కూడా సహజంగా ఉండాలి. జరుగుతున్నట్లు వారికి తెలియనక్కరలేదు. మండుతున్న కట్టెపేడుతో, మండవలసిన కట్టెపేడు చేరినపుడు ఏం జరుగుతుంది? అలా ఉండాలి. ఈ నా మాటలు నీకు బోధపడ్డాయనుకుంటాను. ఈ చిన్నమార్పు నీలో వస్తే చాలు. ఇక కథ దారికి వస్తుంది. ఏమంటావ్?

మాస్టరుగారు సూటిగా చూస్తున్నారు. ఆ చూపులు ఎంత సూటిగా ఉన్నాయో అంత హాయిగా కూడా ఉన్నాయి. అతని మనస్సులో మిగిలిన ఆ కొద్ది ద్వేషాన్ని కరిగించి, ప్రేమగా రూపొందిస్తున్నట్లున్నాయి. గొంగళిపురుగు సీతాకోకచిలుకగా రూపొందుతున్నవేళ, ఆ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లుగా ఉన్నాయి. అర్థమైంది నాకర్థమైంది. నాకు కావలసిన జవాబు దొరికింది. ఇక ఈ జీవితం దారిన పడుతుంది. ఇంతవరకూ నచ్చిన దానిని ప్రేమించాను నేను. ప్రేమగలవాడికి



నచ్చనిదంటూ ఏమీ ఉండదని ఇపుడు తెలుసుకున్నాను. తోటి వ్యక్తులను మనలోని ప్రేమ పొదుగుతుంది. మనలోని ద్వేషం రెచ్చగొడుతుంది. ఇప్పుడు నాకర్థమైంది. నాకు హాయిగా ఉంది. బరువు దిగిపోయినట్లుంది. మనస్సుతో పాటు శరీరం కూడా తేలికపడింది. ఒకానొక హాయి నన్ను ముంచెత్తింది. ఆహా! ప్రేమ ఎంత హాయిగా ఉంటుంది. ఆ హాయిని మనలో వెలిగించే సన్నిధి ఇంకెంత హాయిగా ఉంటుంది. ఇదిగో ఇంత హాయిగా ఉంటుంది" అనుకుంటూ అతడు మాస్టరుగారి పాదాలపై వాలిపోయాడు. ఈ హాయిలో సాయిని చూడగలగాలి. మాటల మధ్యలో ఒక ఆత్మీయుని గూర్చిన ప్రసక్తి వచ్చింది. కృష్ణశాస్త్రిగారే ఆ ప్రసక్తి తెచ్చింది. "అతని ఆలోచనా విధానంలో ఎక్కడో చెప్పలేని, ఒక వెలితి కనబడుతోంది. అది ఏమిటంటారు?" అని అడిగారాయన.

మాస్టరుగారు ఇలా అన్నారు! రచనలో సూటిదనమున్నది. చెప్పడంలో స్పష్టత ఉన్నది. ఆలోచనా విధానంలో మరికొంత సమన్వయం అతడిలో రావలసియున్నది. నేనీ విషయం అతనితోనే చెప్పాను. చెప్పినపుడు ఓర్పుగా విన్నాడు. విన్నది నచ్చడానికి, నచ్చింది దర్శనం కావడానికీ, దర్శనమిచ్చింది అతని జీవిత విధానంగా రూపొందడానికి కొంత సమయం పడుతుంది. ఇక్కడ కొంత సమయం అంటే, ఒక్కొక్కపుడు కొన్ని జన్మలు పట్టవచ్చు. జనన మరణాలు, జన్మల పరంపరలూ మన దృష్టిలో పెద్ద విశేషాలూ కావచ్చు. కాని కాలానికవి అసలు విశేషాలే కావు. సహజమైన అంశాలు.

ఇంతకూ నేనతనికి చెప్పింది? ఏమిటంటే, "అబ్బాయి! నీవు నాస్తికులను ద్వేషిస్తున్నావు అదేమంత మంచిపని కాదు. ఎందుకనంటే ఈ సృష్టిలో ఎవరి పరిణామం వారిది. పరిణామంలో ఎవరు ఎక్కడ ఉన్నారో, దానిని బట్టి వారి అభిరుచులూ, విశ్వాసాలు ఉంటాయి. గొంగళిపురుగుల వల్ల తాత్కాలికంగా ఇబ్బంది ఉన్నమాట నిజమే. ఇబ్బంది ఉన్నది కదా అని వాటినన్నింటినీ చంపేస్తే, సీతాకోకచిలుకలు ఎక్కడి నుండి వస్తాయి? వాటిని చంపకూడదు. అసహ్యించుకోకూడదు. అలాగని వాటి బారిన పడకూడదు. వాటి మానాన వాటిని బ్రతకనిస్తే, కాలక్రమాన అవే సీతాకోకచిలుకలై, మన కనులకు, విందు చేస్తాయి.

ఈ సృష్టి మన ఒక్కరిదే కాదు. ఈ సృష్టిలో ఉన్న వారందరిదీ. అందులో కొన్ని తెగలు మనకు నచ్చకపోవచ్చు. కొన్ని తెగలు మనని మెచ్చకపోవచ్చు. అంత మాత్రాన వారు నశించాలి. అని మనకు అనిపించకూడదు. నశించాలి, అని చెప్పి ఎవరు ఎవరిని గూర్చి వివాదం నినాదం చేసినా





మార్గదర్శులు. మెల్లగా మనం 'కంచి' కథలోనికి వెళదాం.

'నగరి' నుండి పయనమయ్యాక తిరుత్తణిలో సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకొని, కంచి, ఆరణి, చిదంబరం మీదుగా రామేశ్వరం చేరుకున్నారు స్వామి. 1922 వ సం॥ యాత్ర ప్రారంభ వసంతాలలో స్వామివారు రామేశ్వరంలో ఇసుకను భద్రపరుచుకుని దానిని అలహాబాద్‌లోని త్రివేణీ సంగమంలో 1934వ సం॥ కలపడం జరిగిందని పాఠకులు గుర్తు చేసుకోగలరు. అలాగే త్రివేణీ సంగమంలో స్వీకరించిన పవిత్ర గంగాజలాలతో రామేశ్వరునికి పూజారులు అభిషేకం చేయడం జరిగింది. ఇలా స్వామివారి గంగాయాత్ర సంపూర్ణమయ్యింది. ఆ తర్వాతి రోజు నుండే స్వామివారి ఆరు నెలల మౌనవ్రతం ప్రారంభమయింది. పదహారు వసంతాల తర్వాత పుదుకొట్టై వేంచేసిన స్వామి వారికి రాజకుటుంబీకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారు మౌనంలోనే ఉన్నా, ఎన్నో వేల మంది వారి దర్శనం కోసం పరితపించి తరించారు. తమ 21 వసంతాల విజయయాత్రకు చివరిమెట్టుగా తిరుచురాపల్లిలోని మాతృభూతేశ్వరుని, జంబుకేశ్వరంలోని అఖిలాండేశ్వరిని, శ్రీరంగంలో రంగనాథుని దర్శించుకుని స్వామివారు జూన్ 29వ తేదీ, 1939వ సంవత్సరంలో మరల మఠ ముఖ్యకేంద్రమైన కుంభకోణం చేరుకున్నారు. భక్తుల శంకర విజయనామాల మధ్య జూన్ 30వ తేదీ వ్యాసపూజ జరిగింది.

సకల జగత్తు భగవంతుని ఉనికికి ఆలవాలమయినా, భౌగోళిక స్థితి ననుసరించి శీతోష్ణములు ఎలా అనుభవమవుతాయో – మహాత్ముల పదస్పర్శతో పునీతమయిన భరతభూమిలో ఎన్నో ప్రాంతాలలో, తపోక్షేత్రాలలో భగవంతుని ఉనికి స్పష్టంగా అవగతమవుతుంది. ప్రకృతి సహజ 'ధర్మా'న్ననుసరించి ఆ ధర్మాన్ని పాటించే జీవులను ఆదరించి, ఉద్ధరించడమూ, ధర్మాన్ని మరచిన జీవులకు ఆ 'గుర్తింపు'ను కలగచేయడమూ రెంటినీ నిర్వహించే కరుణా స్వరూపులు సద్గురుచంద్రులు. ఈ ఉద్ధతి, సద్గతి అనుశ్రుతంగా జరుగుతూనే ఉంటుంది. శ్రీసాయి చరిత్రలో ద్యోతకమయ్యే ఎందరో 'భక్త విజయాలు', మనకు స్వామివారి చరిత్రలోనూ కానవస్తాయి. ఇదిగో అలాంటి ఒక సద్భక్తుని విజయగాథను గుర్తు చేసుకుని ఆనందిద్దాం.

భారతదేశంలో అన్నదానము, అన్న ప్రసాదము ఎంతో పవిత్రంగా భావించబడతాయి. మనిషి ప్రాణాన్ని నిలబెట్టి 'బుద్ధి'కి సత్తువనిచ్చేది అహారమే కదా! కనుక అన్న ప్రసాదము ఒక యజ్ఞమేనని పెద్దలవాణి. అందుకే "ఆకలిగొన్న ఒక జీవికి ఆకలి తీరితే ఆ జీవిలో ప్రాణ స్వరూపుడై ఉన్న 'బాబా'



## గురుకృపాలహరి

**సిరికింజెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింప డే**
**పరివారంబును జీర దభ్రగపతిన్ బన్నింప డాకర్ణికాం**
**తరధమ్మిల్లమ్ము జక్కనొత్తడు వివాదప్రోత్థిత శ్రీకుచో**
**పరి చేలాంచలమైన వీడడు, గజప్రాణావనోత్సాహియై**

అంటారు పోతనామాత్యుడు భాగవతం గజేంద్రమోక్షం ఘట్టంలో. ఏ యజ్ఞయాగాదులు, భీకర తపస్సు నెరపని గజరాజు తనను మొసలి కబళిస్తున్న క్రమంలో ఆ నొప్పులకు తాళలేక శ్రీమహావిష్ణువుకు శరణన్న క్షణాన, ఆ శరణాగతుని రక్షించే క్రమంలో శ్రీమహాలక్ష్మి పమిటతో కలిసి పడిగెడుతున్నానని, తన నాలుగు చేతులు ఖాళీగా ఉన్నాయని, తన వాహనమైన గరుడుని కూడా పట్టించుకోలేదని, పరివారమంతా తన వెంట పరుగుపెడుతున్నా, పెడచెవిన పెట్టి మరీ పయనమయ్యాడని పోతనామాత్యుడు తేనెలొలుకుతూ కీర్తించిన క్రమం. అన్ని జీవులూ అంతర్యామి తత్వం వైపు అనుగమించిన ఆ రోజుల నుండి మనిషిగా జన్మించి కూడా ఆంతర్యంలో కొలువైన దైవాన్ని తెలుసుకోలేని స్థితిలో మానవుడు పయనిస్తుంటే దైవం-గురువు రూపంలో తన ఉనికిని మనిషి మదికి తెలియజేయడానికి శంఖు, చక్రాలను, గదా పద్మాలను ధరించకుండానే మనలో ఒకరిగా జీవించారు. ఆ మహాత్ముల ఆగమనంలో, జననంలో ప్రకృతి పులకరించే వేళను జగమంతా గుర్తించకపోవచ్చు. అయితే, ఆ సద్గురుచంద్రుల, జగద్గురు వంద్యుల కృపను అవగతం చేసుకున్నాక వారి కనుసన్నల్లో సాగే మన జీవితం, ప్రతీరోజూ పండుగేనన్న విషయాన్ని సద్భక్తులు తప్పక తెలుసుకోవాలి. 'శరణాగతి' గజేంద్రునికి అవగతమయ్యింది - 'హరి' ఆగమనం సులభమయ్యింది. మరి మన జీవితఘట్టమో! అపారకృపాంబుధిగా, అవ్యాజమైన ప్రేమజలధిగా, తరలివచ్చిన పావన గంగా తీర్థంగా 'గురువు' వెంటబడి మరీ మనలను కాపాడి, రక్షించి, ఉద్ధతిని-సద్గతిని అందించడానికి తపిస్తున్నాడు. కురిసే మేఘమై మన చెంతకే వచ్చి మనలను తన ఆశీఃధారలతో తడుపుతున్నా మనం అలసత్వం వహిస్తున్నామా! గురువును అర్థం చేసుకోకుండా జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటున్నామా! ఆలోచిద్దాం. "సమస్తమూ నా ఆజ్ఞతోనే సాగుతాయి, ఆగుతాయి, నువ్వు కేవలం సంయమనం పాటించు" అంటే మనం జీవితాన్ని ఆస్వాదించక, ఆనందపు తావులలో పయనించక గందరగోళం చేసుకుంటున్నాము. మహాత్ముల చరిత్రముల మననములు - మనో సంయమనానికి





అది తప్పే అవుతుందిగాని, ఒప్పుకాదు. **"నశించాలి అని అనకూడదు. అందరూ వసించాలి, అందరూ వర్ధిల్లాలి"** అనాలి. మనలో ఒకరి సిద్ధాంతం మరొకరికి నచ్చకపోవచ్చు. కానీ, ఈ సృష్టిలో అన్ని సిద్ధాంతాలకు అవకాశం ఉన్నది. అన్ని సిద్ధాంతాలకూ ప్రాతినిధ్యం ఈ సృష్టిలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. నాస్తికత్వం, ఆస్తికత్వం ఈ సృష్టికి క్రొత్త కాదు. మొదటి నుండి ఒకదాని ప్రక్కన ఒకటి వస్తూ ఉన్నవే. మహాభారతం చదివావా? మహాభారతం ఏ ఘట్టంతో ప్రారంభమవుతుంది?

సర్పయాగాన్ని ఆపించడంతో ప్రారంభమవుతుంది. "సర్పాల వల్ల మాకు ద్రోహం జరిగింది. కనుక సర్ప కులం సమూలంగా నాశనమై పోవాలి" అని ప్రారంభిస్తారు సర్పయాగాన్ని. కాని ఆ కోరిక నెరవేరలేదు. సర్పయాగం పూర్తికాలేదు. సర్ప కులం పూర్తిగా నశించిపోలేదు. ఆస్తికుడు వచ్చి కలుగచేసుకుని, జనమేయజయుడికి నచ్చచెప్పి, సర్పయాగాన్ని ఆపించేశాడు. దీని అర్థమేమిటి? ఈసృష్టిలో ఏ జాతిగాని, ఏ ఆలోచనా విధానంగాని పూర్తిగా నశించిపోవడమనేది జరగదు. జరగకూడదు. అందరూ ఉండాలి. అన్ని విధాలుగా ఆలోచించేవాళ్ళు ఉండాలి. ఎవరినీ ఎవరూ ఇబ్బంది పెట్టుకోకుండా, ఎవరిని ఎవరూ కించపరచుకోకుండా, అందరూ ముందుకు సాగాలి. ఒకరినొకరు చిన్నచూపు చూడకూడదు. ఒకరినొకరు తక్కువగా అంచనా వేయకూడదు. ఎవరున్న స్థితిని బట్టి వాళ్ళు ఆలోచిస్తారు. అది తెలిసి మనం వాళ్ళను ప్రేమించాలి, గౌరవించాలి, ప్రోత్సహించాలి. చేతనయితే పరిణామంలో వారిని ముందుకు నడిపించాలి. అప్పుడు ఆపైన ఏం కనబడుతోందో వారే చెబుతారు. మనమెందుకు తొందరపడటం? మనమెందుకు తెగనాడటం? మనమెందుకు వారిని తూలనాడటం? **ఈ తెగనాడటాలూ, తూలనాడటాలూ దేనిని తెలియ చేస్తున్నాయి?మనలో ప్రేమలేనితనాన్ని తెలియచేస్తున్నాయి.** మీరన్నారే ఇందాక ఏదో వెలితి కనిపిస్తూ ఉంటుందని. అది ఇదే. ఈ ప్రేమ రాహిత్యమే. ఈ అంశాన్నే అతనికి నొక్కి చెప్పాను. ఇంకొక మాట కూడా చెప్పాను! సత్యానికి చాలా దూరంగా ఉన్నారని, ఆ నాస్తికులనబడే వారిని గురించి నీవు అంతగా చింతిస్తున్నావే? వారిని రెచ్చగొడుతూ, పందెం కాస్తూ, రచనలు చేస్తున్నావే. దానికన్నా సత్యాన్ని తెలుసుకోదలచిన వాళ్ళు ఎందరో ఉన్నారు. వారికి, సత్యాన్ని గూర్చి మృదుమధురంగా తెలియచెప్పటంలో నీ రచనాశక్తిని సద్వినియోగం చేయవచ్చు కదా! ఉన్ముఖులు కాని వారిని చూసి గద్దించేకన్నా, ఉన్ముఖులై నిలుబడుతున్న వారి యెడల బాధ్యత పడి నిలబడవచ్చు కదా! ఈ మాటలతనికి



కొంత నచ్చినట్లున్నాయి.

మరొకమాట కూడా చెప్పాను. దైవాన్ని గూర్చి ప్రస్తావన లేకుండా జీవించేస్తున్న వారికన్నా, దైవాన్ని గూర్చి ప్రస్తావన తెస్తూ, **అతడు లేడూ అతడు లేడూ** అని ఒకటికి పదిసార్లు అంటున్నవాళ్ళు పరిణామంలో కొంత ముందుకు వచ్చినట్లే కదా! **"లేడు, లేడు"** అనటంతో వారు తమ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. చాలా తీవ్రంగా ప్రారంభిస్తున్నారు. ప్రారంభించనివ్వండి. ఆ ప్రయాణం కొనసాగాలని కోరండి. కొనసాగి చేరవలసిన చోటుకు చేరితే **"ఉన్నాడు, ఉన్నాడు"** అని వాళ్ళు మనకన్నా పెద్ద గొంతులతో చాటుతారు. శుభమా! అని వాళ్ళ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే మనం పనిగట్టుకొని తుమ్మడం ఏమైనా బాగున్నదా? దేవుని యొక్క ప్రస్తావన లేకుండా జీవించే వారికన్నా, దేవుని ఫోటోలు పెట్టుకొని, వాడికేదో రొటీన్‌గా ఇంతచేయి చూపించి, తమ మానాన తమకు తోచినట్లు బ్రతికేస్తున్న వారికన్నా, లేదా తమకున్న చిన్న, పెద్ద బాధ్యతలన్నీ తాము పూజించే దేవుడి నెత్తిన వేసి, మాదేమున్నది? మేం నిమిత్తమాత్రులం అని సోమరిపోతులుగా రూపొందుతున్న వారికన్నా, జీవితంలో ఇంత కష్టం రాగానే, మంత్రాన్ని, గురువుని ఇంకా చెప్పాలంటే తన మతాన్ని మార్చేసుకుంటున్న, వారికన్నా ఈ లేడు, లేడు అంటూ, అతడికొరకు నిజంగా వెతుకుతున్న వాళ్ళని మనం తక్కువచేసి మాట్లాడవచ్చునా? ఇది ఆలోచించవలసిన అంశం కాదా? అని అన్నపుడు అతడు మరికొంత ఆలోచనలో పడినట్లు కనిపించాడు.

అప్పుడిలా చెప్పాను "తమ్ముడూ! సమాజం అన్న తర్వాత అన్ని స్థాయిల్లో ఉన్నవాళ్ళు ఉంటారు. ప్రేమతో, వారి స్థాయికి తగినట్లుగా, వారికి తగిన దోహదాన్ని అందించడమే మన కర్తవ్యం. అనాదిగా దేవుడి పేరిట పెద్దలందరూ చేస్తూ వస్తున్న పని అదే. ఉన్నస్థితి నుండి, ఉండవలసిన స్థితికి మానవజాతిని నడిపించడమే. ఆ నడిపించడానికి మన తెలివితేటల కన్నా, మన విమర్శనాజ్ఞానం కన్నా, మన వాదనా పటిమకన్నా, మనలోని ప్రేమే అందుకు పనికివచ్చేది. ప్రేమ ముందు నడవాలి, ఆ ప్రేమకు ఒదిగి, మనలోని శక్తియుక్తులన్నీ మెలగాలి. అప్పుడు అందరినీ అక్కున చేర్చుకోవడం చేతనవుతుంది. అందరినీ అర్థం చేసుకోవటమూ చేతనవుతుంది. అందరి ఎదుగుదలకూ దోహదం చేయటమూ చేతనవుతుంది". ఇది నేను చెప్పిన చివరి మాట. ఇప్పటికి మీకు చెప్పే చివరిమాట కూడా ఇదే.

**– మోపిదేవి కృష్ణస్వామిగారి 'అక్షరాల్లో అనుభూతులు'**





– మీదే ఉన్నారు. మీరే కానీ బయటకు చెప్పకుండా ఉంటే, నేను మీకు లక్షరూపాయలు ఇచ్చేసి, కొనుక్కుంటాను అని చెబుతూ లక్ష రూపాయలు అడ్వాన్స్ కూడా ఇచ్చేసాడు. అయిపోయిందిగా, అప్పటికప్పుడు అడ్వాన్స్ కూడా ఇచ్చేసాడు.

అప్పటికప్పుడే సక్సెస్ చేసేసారు గురువుగారు. అయితే, ఆ అమ్మే భూమిని మేము కౌలుకి ఇచ్చి ఉన్నాం. మేము భూమిని అమ్మాలంటే కౌలుదారు మాకు తిరిగి ఇచ్చివేయాలి. కానీ ఒకరోజు అతను వచ్చి మీరు భూమి అమ్మినా, నేను కౌలు వదిలిపెట్టను. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి. అని మా మీద అరచి, గందరగోళం చేసి వెళ్ళాడు. మేము గురువుగారితో స్వామీ, మీరు ఇలా మంచి ధర ఇప్పించారు. కానీ కౌలుదారు వదలకపోతే కొనేవాడు పొలం కొనడు. మాకు డబ్బులు రావు అని ప్రార్థించుకున్నాం. ఆ కౌలుదారు ఆ రోజు రాత్రి ఇలా గొడవ చేసి వెళ్లాడు, వేకువఝామున నాలుగు గంటలకి ఎవరో తలుపు తడుతుంటే, ఎవరా ఈ సమయంలో వచ్చారు అని ఆలోచిస్తూ వెళ్ళి చూచేసరికి రాత్రి గొడవచేసి వెళ్ళినవాడు ఇపుడు నాలుగు గంటలకి వచ్చి, అయ్యా, మీ భూమి మీకు తిరిగి ఇచ్చేస్తాను. నేను పొరపాటుగా మాట్లాడేసాను, అని చెప్పి వెళ్ళిపోయాడు. నేను ఆశ్చర్యపోయాను. వాడు తెల్లవారిన తర్వాత అయినా రావచ్చు. కానీ రాత్రి పది గంటలకి ఆ విధంగా మాట్లాడి, వెళ్ళినవాడు తెల్లవారుఝామున నాలుగు గంటలకి వచ్చి క్షమాపణ చెప్పడంలోనే ఉంది. అతడు తెల్లవారేవరకు ఉండలేకపోయాడు, తప్పు చేసాను అని చెప్పడానికి ఆ రెండు, మూడు గంటలు ఓర్చుకోలేకపోయాడు. తెల్లవారిన తర్వాత వచ్చి చెప్పినా ఏమీ అనిపించేది కాదు. కానీ ఆ సమయంలో వచ్చి క్షమాపణ చెప్పడంలోనే ఉంది గురువుగారి లీల. కాబట్టి, ఆ సమస్య కూడా తీరిపోయి, అప్పులన్నీ తీర్చేసుకొని ప్రశాంతంగా ఉన్నాం.

**– 'నామం' జగన్మోహనరెడ్డి**

**శ్రీబాబూజీ ఆచరించి, ప్రబోధించిన బాబాపథం, సాయిపథం, సద్గురుపథం.**

సాయిపథం అంటే బాబా కేంద్రంగా, బాబాను ఆధారం చేసుకొని, బాబా చుట్టూ మన యొక్క ఎమోషన్స్, మనసు, హృదయం అల్లుకున్న పథం, మార్గం. అది మన జీవితంలో భాగం కావడం కాదు. మన జీవితమే అందులో భాగం కావాలి. మనం ఏ ఆలోచన చేసినా, అది ప్రాపంచికం కావచ్చు, లేదా ఆధ్యాత్మికం కావచ్చు, ఏదైనా సరే మనం చేసే పనులు, ఆలోచనలు, మన జీవితం అంతా బాబాను కేంద్రంగా చేసుకునే ఉండాలి.



కొన్ని నగలు ఉన్నాయి. బ్యాంకులో పెడితే డబ్బులు వస్తాయి. అవి వాడుకుందాం". అని అన్నది. కానీ ఆ నగలు నెల్లూరులో ఉన్నాయి. మేము శిరిడీలో ఉన్నాము. ఏం చేయాలి? సరే అయితే, రేపు మనం బయలుదేరి నెల్లూరు పోదాం. బ్యాంకులో నగలు పెట్టి ఎల్లుండి బయలుదేరి మరలా శిరిడీకి గురువుగారి దగ్గరకు వచ్చేద్దాం. అనుకొని అలాగే నెల్లూరుకు పోయి, ఆ నగలు బ్యాంకులో పెట్టి, వాళ్ళు ఇచ్చిన 14,000రూ॥లు తీసుకొని మరుసటిరోజు బయలుదేరి శిరిడీకి వచ్చాం. అప్పట్లో ట్రెయిన్ టిక్కెట్లు కూడా దొరకవు. అందుకని జనరల్ కంపార్ట్‌మెంట్‌లో పోయాం. మరలా డబ్బులు తీసుకొని తిరిగి శిరిడీకి వచ్చాం. అది ఫెయిత్ అంటే. ఇప్పుడు గురువుగారి కోసం అడిగితే లక్ష రూపాయలు అయినా ఇచ్చేస్తాం. అది కాదు ఫెయిత్ అంటే. అప్పుడు అందుకనే మనకు అప్పు ఇచ్చేవాడు లేదు. ఎవరో గురువుగారు అంట, ఆయన కోసం నగలు తాకట్టుపెట్టి, 3 రోజులు ప్రయాణం చేసి, వచ్చారంటే అది ఫెయిత్ అంటే. గురువుగారి మీద భక్తి అనే దానికి నిదర్శనం. ఆరోజు నాకు గురువుగారి మీదున్న అభిమానంతో ఆ నెలంతా ఉండాలని, ఆ 14,000 రూ॥లు తెచ్చి, గురువుగారు నార్త్‌ఇండియా వెళ్ళేవరకు శిరిడీలోనే ఉన్నాం. అది ఫెయిత్ అంటే. ఈ పాయింట్ నేను స్ట్రెస్ చేసి చెబుతాను. ఇలా గురువుగారి అనుగ్రహంతో ఒకటి తర్వాత ఒకటి అన్నీ జరిగిపోతున్నాయి.

నేను గురువుగారి దగ్గరకు వచ్చినపుడు 10 లక్షలు అప్పులో ఉన్నాను. ఆ అప్పును తీర్చడానికి నా దగ్గర ఉన్న భూమిని అమ్మేద్దాం అనుకున్నాను. కానీ నేను ఇలా అప్పుల్లో ఉండి ఆ అప్పును తీర్చడానికి భూమిని అమ్మేస్తున్నాం అనే విషయం మా ఊరిలో అందరిలో తెలిసి ప్రతి ఒక్కరు లక్ష రూపాయలు విలువచేసే ఎకరాభూమిని 80,000/-కే అడుగుతున్నారు. వీడు అప్పుల్లో ఉన్నాడు, ఇచ్చేస్తాడులే అని అందరికీ నా పరిస్థితి అర్థమయిపోయింది. ఈ సమస్య తీరాలంటే గురువుగారే ఏమన్నా చేయాల్సిందే కానీ, మనమేం చేయలేము అనుకొని, గురువుగారిని ప్రార్థించుకున్నాను. సార్, ఇలా ఉంది పరిస్థితి. అందరూ కట్టకట్టుకొని 80,000/-కే అడుగుతున్నారు. నాకు ఎకరాకు లక్షరూపాయలు ఇప్పిస్తే తృప్తిపడతాను అని గురువుగారికి చెప్పుకొని ఊరికి బయల్దేరాం. అక్కడకు వెళ్ళిన తర్వాత ఊరిలో అందరి తరపున ఒకాయన నన్ను పిలిచి, కాఫీ త్రాగి వెళ్దురు రండి అంటే ఆయన ఇంటికి వెళ్ళాను. ఆయన మాటలలో మీరు పొలం అమ్ముతాను అన్నారు కదా అని అడిగి, సార్, మేము ఊరిలో అందరమూ కలసి 80,000/-కి అనుకున్నాము. కాబట్టి అందరూ రూ.80,000/



# శిల - శిల్పి



శిలను శిలగానే చూస్తాడు సామాన్యుడు. శిలను కొద్ది మార్పులు చేసి నిర్మాణపు పనులకు ఉపయోగించుకుంటాడు నిర్మాత. కాని శిల్పి ఒక శిలను చూడగానే అది ఎందుకు పనికివస్తుందో, దానిలో ఏ ఆకృతి దాగియున్నదో దర్శించి, ఆ రూపాన్ని చూస్తూ దానికి పైనున్న అడ్డంకులను తొలగించుకుంటూ పోతాడు. ఇక్కడో వాస్తవమున్నది. అతడు లేనిదాన్ని సృష్టించడం లేదు. మనకు కనిపించనిదేదో అతనికి కనిపిస్తున్నది. దానిని బహిర్గతం చేయడంలో అతడు నిరంతరం శ్రమిస్తున్నాడు. ఆ శ్రమలో అతనికి ఆనందమున్నది. అతని ఆవిష్కరణలో ఒక అందమున్నది. ఆ అందము నిండా అతని **డెందము**న్నది **(హృదయము)**.

సద్గురువు కూడా శిల్పియే. కాని అతడు జీవశిల్పి. ఆయన తనను ఆశ్రయించినవారిలోని వెలుగును దర్శిస్తాడు. ఆ వెలుగును బహిర్గతం చేసేందుకు వారిలోనున్న అడ్డంకులను వివిధ శిక్షణల ద్వారా తొలగించివేస్తాడు. ప్రతి జీవికి ఒక వ్యక్తిత్వముంటుంది. 'నేను' అనే అహంకారముంటుంది. ప్రతివానిలోనూ దైవీగుణాలు, అసురగుణాలు రెండూ ఉంటాయి.తొలిచూపులోనే సద్గురువు ఒక వ్యక్తి యొక్క సమగ్ర స్వరూపాన్ని దర్శిస్తాడు.

శిల-శిల్పిని ప్రతిఘటించదు. తనను తాను సమర్పించుకుంటుంది. సాధకుడు కూడా సద్గురువునకు సమర్పణ చెందిననాడే తన స్వస్వరూపాన్ని ఆవిష్కరించుకోగలుగుతాడు. సద్గురువు జీవశిల్పి. అతడు మన స్వరూపాన్నెరిగి కరిగించాల్సినవి కరిగించి, కలిగించాల్సినవి కలిగించి, వెలిగించాల్సినవి వెలిగిస్తాడు.

**మహాత్ములు - తరహాలు :** ఆచార్య వినోబాభావే అంటారు... ఈ లోకంలో మహాత్ములు రెండు రకాలుగా దర్శనమిస్తారని. కొందరు మహాత్ములు పెద్ద వృక్షం వంటివారు. ఆ వృక్షం అనేకమందికి ఆశ్రయమిస్తుంది. పోషణనిస్తుంది. చల్లని నీడనిస్తుంది. కాని తన నీడన మరోవృక్షం అంతగా పెరగడానికి అవకాశమివ్వదు. మరికొందరు మహాత్ములు గంగిగోవు వంటివారు. ఆవు దగ్గర దూడ ప్రారంభంలో చాలా చిన్నదిగా ఉంటుంది. ఎంతో వాత్సల్యంతో ఆ దూడను సాకి, పోషిస్తుంది. ఆ ఆవు చూస్తుండగానే దూడ ఆవును మించి ఎదుగుతూ ఉంటుంది. తన దూడను చూసి ఆవు మురిసిపోతుంది.

ఆవు దూడ ఎదుగుదలకు ఎట్లు సహకరిస్తుందో వారలా తనను ఆశ్రయించిన వారిలో ఉన్న దివ్య గుణాలను పోషించి వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తారు. "తనను ఆశ్రయించిన వారిని తనంతటివారిగా చేయుటయే గురువు వాగ్దానము". - ***"అనంతపుత్రుని అనంత వైభవము" నుండి***



## సరిదిద్దు - సంస్కరించు - సరిదారి చూపు - శరద్బాబు

ఈ పర్యాయం ప్రశ్న – జవాబు కాక, గురుబంధువుల అందరూ ఆనందించాలని 1988వ సం॥లో జరిగిన సంఘటనను వివరిస్తున్నాను. ఒక మామూలు భావన నుంచి మహిమాన్వితుడను తలంపు తలకెక్కిన తరువాత వారి వెంట వెన్నంటి తిరగాలని, వారితో ఎక్కువ కాలం గడపాలని, వారి మాటలు వినాలని వారు చెప్పింది చప్పున చేయాలని ప్రారంభంలో నూత్న ఉత్సాహంతో సర్వసాధారణంగా అనిపిస్తుంది. అలాంటి సంఘటన నా కంటి ముందు నూతన సంవత్సర ఆరంభ సమయంలో జరిగింది.

శరద్బాబూజీగారితో మొదటిసారిగా పరిచయమైన వారందరూ వారిని సామాన్యమైన వ్యక్తిగానే భావించారు, ఒకరో, ఇద్దరో తప్ప వారిని ఆ రోజుల్లో గురువుగా భావించలేకపోవడానికి కారణం సర్వసామాన్యమైన వారి జీవన విధానం. సాధారణమైన రీతిలో కనిపించేవారు. వాస్తవం చెప్పాలంటే నిజంగా మహాత్ములను సందర్శించిన వారెందరున్నారు. మహాత్ముల పోకడ ఎలా ఉంటుందనేది తెలియకపోవడమే అందుకు కారణం కావచ్చు. దైవం మన ముందర తిరుగాడుచున్నపుడు, సాక్షాత్తూ సద్గురువు మనకందరికి సందర్శన ప్రాప్తిని కల్గింప చేసినను అర్థం చేసుకొనువారు చాలా అరుదుగా ఉంటారు. లౌకిక ప్రజ్ఞ కలిగిన మానవుని భావాలు ఎలా ఉంటాయో అలానే ఉన్నాయి, బాబుగారి వెంట తిరుగుతున్న వాళ్ళకు.చూచేవారిలోను, వెంట తిరిగిన వారిలోను క్రమక్రమంగా పరిణితి కలిగింది. మొదట స్నేహితునిగా, ఆ తరువాత విద్యావంతునిగా, ఆ పిమ్మట సంస్కారవంతునిగా, సంస్కర్తగా, మేధావిగా, మహామహోపాధ్యాయునిగా, తపస్సంపన్నునిగా, సాధకునిగా, సాయిసాధనా స్వరూపిగా, "వారు దైవమే" అన్న అనుభవంగా మారుతూ, మారుతూ వచ్చింది. చిట్టచివరకు సద్గురుని రూపమెలా ఉంటుంది? అని ప్రశ్నిస్తే ఠక్కున సాయినాథుని శరద్బాబూజీలా ఉంటుందని సమాధానమిచ్చేవారు. అంతగా వారిలో పరిణతి చెందడానికి కారణం గురువుగారి మహిమలు, లీలలు, బోధలు అందుకు ఎంతగానో తోడ్పడినవి. అలాంటి సంఘటనను తెలియచేయు యదార్ధ సంఘటనను వివరించుతాను గురువుగారి ఆశీస్సులతో.. గురువుగారు "సాయిపథం" పత్రికలో శ్రీఉపాసనీ బాబా జీవిత చరిత్రను సమగ్రంగా పరిచయం చేసారు. అందులో ఉపాసనీ "నా చర్మమును ఎవరో వలిచివేస్తున్నట్లు అనిపించిందను" మాట అప్పట్లో అర్థం కాలేదు. చర్మాన్ని వలిచి వేయటమేమిటి? అనే అనుమానం? వలిచివేసేటపుడు ఎలా భరించగల్గుతాడను సందేహము





*(15వ పేజీ తరువాయి)* నా ఇబ్బందిని గమనించి, నా వలన లేట్ కాలేదని చెప్పటానికే అన్నట్లు, ఆయన పై పంచె అంతా తీసి (బాగానే ఉన్నప్పటికీ) సర్దుకొని మరలా భుజంపై వేసుకుంటున్నారు. చూడండి, ఎంతటి సూపర్ ఇంటెలిజెంట్ పర్సనో ఆయన. నా తడబాటును తెలియనీయకుండా, గురువుగారు పై పంచెను సర్దుకుంటున్నారు. కాబట్టి ఆయన నామం మొదలు పెట్టలేదు అన్నట్లుగా చేసారు. లేకపోతే ప్రతీరోజు పై పంచెను సర్దుకోనివారు ఆ రోజు ఎందుకు సర్దుకుంటారు? అంతా బాగానే ఉన్నా, నేను చేసిన ఆ ఆలస్యంకి ఇలా సర్దుకొని ఆ సందర్భాన్ని రక్తికట్టించారు. ఆ సమయంలో ఏ రాగంలో నామం చెప్పాలా అని ఆలోచించే సమయం కాదు. అప్పుడు అప్రయత్నంగా 'మధ్యమావతి' అనే మంగళకరమైన రాగంలో నామం వచ్చింది. అప్పుడు గురువుగారి ముందు 8, 9 నిమిషాలు నామం చెప్పాను. గురువుగారు స్టేజిమీదకు వచ్చినపుడు నామం చెప్పిన సంఘటన చాలా ముఖ్యమైనది. ఎందుకంటే, నేను గురువుగారి దగ్గర 15 సం॥లుగా ఉన్నా. అపుడు, ఆరోజు, ఆ రాగంలో చెప్పిన నామం ఇంతవరకు చెప్పలేదు. అంతేకాకుండా, తర్వాత ఎన్నోసార్లు వారి దర్శన సమయంలో గురువుగారికి దగ్గరగా కూర్చునేవాడిని. కానీ, మరలా ఎప్పుడూ గురువుగారి ముందు నామం మాత్రం చెప్పలేదు. నాకు ఏమి అనిపించిందంటే, నేను అప్పుడేదో అజ్ఞానంలో ఉండి, గురువుగారిని అడిగినా, నాబోటి అర్భకుడికి ఆయన అనుగ్రహం ఇచ్చారు. నాకు ఇంకా లేదు. ఎంతమంది, ఎన్నిసార్లు అడిగినా గురువుగారి దగ్గర నామం బాగా చెప్పాలి కదా, నాకు ఇంకా బాగా నామం చెప్పే కెపాసిటీని ఇచ్చినపుడు చెబుతానులే. నాకు వద్దు సార్ అని చెప్పేవాడిని. అలా గురువుగారి దగ్గర నామం చెప్పాలి అనే కోరిక కూడా తీరిపోయింది.

ఒకసారి గురువుగారు శిరిడీకి వచ్చి వారంరోజులు శిరిడీలో ఉండి, నార్త్ఇండియా వెళుతున్నారు అని తెలిసింది. మేము కూడా ఆ వారంరోజుల పాటు శిరిడీలో గురువుగారి దగ్గర ఉందాము, దర్శనం చేసుకుందాము అనుకొని శిరిడీకి వచ్చాము. కానీ తర్వాత తెలిసింది, గురువుగారు ఇప్పుడు నార్త్ఇండియా వెళ్ళడం లేదు. ఈ నెల అంతా ఇక్కడనే శిరిడీలోనే ఉంటారు అని. నేను స్టన్ అయిపోయాను. ఎందుకంటే మేము తెచ్చుకున్న డబ్బులు 2, 3 రోజుల్లో అయిపోతాయి. కానీ ఇక్కడ గురువుగారు ఉన్నారు, ఆయనను చూడాలని కోరిక. ఆయన ఉన్నన్ని రోజులు మనం కూడా ఇక్కడ ఆయనతో ఉండాలి. ఎట్లా గురువుగారూ! అనిపించింది. మా దగ్గర డబ్బులేదు. డబ్బులు అప్పు ఇచ్చేవారు కూడా లేరు. ఎవరూ తెలియదు. అపుడు నా భార్య నాతో, "అయ్యా, నా దగ్గర



అప్పుడు నేను ఆగి మిమ్మల్ని చూసేలా బాబా చేస్తారు. ఎందుకంటే, నేను మీలో చూసేది ఆ తాజాదనాన్ని, అలా వికసించడాన్ని, ఆ సారాన్నే, ఆ పరిమళాన్నే. మీరు సీనియర్ అయినప్పటికీ మీలో ఆ తాజాదనం పోకూడదు. మీరు వాడిపోయిన పువ్వులా ఉండాలనుకుంటున్నారా? లేక వికసిస్తూ, పరిమళాలు వెదజల్లే పువ్వులా ఉండాలనుకొంటున్నారా?

మన మనస్సులు బాబా పాదాల వద్ద సమర్పించే వికసించిన పువ్వుల్లా ఉండాలి. అవి ఎండిపోయి, వాడిపోయి ఉండకూడదు. దర్శనానికి వచ్చిన ప్రతిసారీ అదే మొదటి దర్శనంగా అనిపించాలి. అప్పుడు మీరు, "మేము సీనియర్స్, వాళ్ళు క్రొత్తవాళ్ళు, మేము ఇలాగ, వాళ్ళు అలాగ..." అనే వాటి నుంచి బయటపడతారు. ఇలాంటివన్నీ తీక్షణమైన సూర్యకిరణాల వంటివి. అవి పువ్వులను త్వరగా వాడిపోయి, ఎండిపోయేలా చేస్తాయి. ఎవ్వరికీ కూడా వారు సీనియర్స్ అనే భావం ఉండకూడదు. ఒక్కసారి సీనియర్ అని అనుకున్నామా, మనం రిటైర్మెంట్‌కి సిద్ధంగా ఉన్నామని అర్థం! (గురువుగారు నవ్వుతూ...) ఆ తాజాదనాన్ని కాపాడుకోండి, ప్రతిసారీ అదే మొదటిసారవ్వాలి.

రాముని రూపాన్ని వర్ణిస్తూ, "క్షణక్షణే యన్నవతా రమణీయ రూపం" అంటారు వాల్మీకి. అంటే క్షణక్షణే – ప్రతిక్షణమూ, అనుక్షణమూ; యన్నవతా – అది నవ్యమైనది, నిత్యనూతనమైనది; రమణీయ రూపం – రాముని మనోహర రూపం. అంటే మనం రాముని రూపాన్ని ఎప్పుడు చూసినా క్రొత్తగానే ఉంటుంది, మనకు విసుగు అనిపించదు. అలానే బాబా రూపం ప్రతిక్షణం ఎంతో అందంగా, నిత్యనూతనంగా, నిరంతరం మారుతూ ఉండి ప్రతిసారీ మొదటిసారి చూస్తున్నట్లుగానే ఉంటుంది. ఈ క్షణక్షణే యన్నవతా – ఈ నిత్యనూతనత్వం మీ జీవితం మొత్తానికి, మీ ఆధ్యాత్మిక అనుభవానికి విస్తరించాలి. ప్రతిక్షణం నూతనమై, సచేతనమై, తాజాదనంతో నిండిపోవాలి. అప్పుడు మీరు నిజంగా నాతో, బాబాతో లేదా ఆ సత్ పదార్థంతో – మీరు దానిని ఎలా పిలిచినా సరే – దానితో సాంగత్యంలో ఉన్నట్లే లెక్క. **ఆ నవ్యత్వాన్ని, ఆ తాజాదనాన్ని అనుభూతి చెందగలగడమే నిజమైన దర్శనం.**

– శరచ్చంద్రికలు

ప్రతిఒక్కరూ తాము శిరిడీకి ఎందుకు వచ్చాము అన్న విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకొని,
దాని నుండి ప్రక్కకు తప్పుకోకుండా, చూసుకోమని నిరంతరం గుర్తు చేసేవారు.
అతి నిద్ర, పోచుకోలు కబుర్ల పట్ల జాగ్రత్త వహించమని హెచ్చరించేవారు శ్రీబాబూజీ.





వీడిపోలేదు.

సద్గురువు సాయినాథుడు చర్మాన్ని వలిచివేయటమేమిటి? అని అనుకున్నాను. కొన్ని సందేహాలకు సమాధానాలు వెంటనే లభించవు. కాలమే కొన్నింటికి సమాధానమిస్తుంది. 1988వ సం॥ డిసెంబర్ మొదటి వారంలో అనుకుంటాను గురువుగారన్నారు. జనవరి 1వ తారీఖున మనమంతా ఒక చోట కలిసి ఆనాటి ముందు రేయి అంటే డిసెంబర్ 31వ తారీఖు రాత్రి 12 గంటలకు "బాబా" పూజోత్సవాన్ని గురుబంధువులంతా సామూహికంగా నిర్వహిస్తే ఎలా ఉంటుంది అన్నారు. చాలా బాగుంటుంది అని ఆ సముదాయంలో ఉన్నవారందరనినారు. ఇది వేంకటగిరిలో తీసికొనిన నిర్ణయము. అయితే ఎక్కడ? అనే ప్రశ్న వెంటనే ఉదయించినది. వెంటనే కార్యక్రమానికి "శ్రీ"కారం చుట్టారు. ఒంగోలులో మన స్కూలు ఆవరణలోనే ఆరంభిద్దామనినారు గురువుగారు. 1988 డిసెంబర్ 31వ తారీఖు రాత్రి 10 గంటలకు నాలుగు చెరగులా ఉండే గురుబంధువులంతా రావాలనినారు. బహుశా అపుడు వేంకటగిరి, తెనాలి, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాలలోని గురుబంధువులకి సమాచారమిచ్చారు. వాస్తవానికి కొద్దిమందే వచ్చారు. సరిగ్గా రాత్రి 11 గంటలకు సాయిబాబా సెంట్రల్‌స్కూల్‌లో 30మంది కూర్చొనుటకు వీలున్న హాలుంది. చక్కని వాతావరణంలో పూజా మందిరం ఏర్పాటు చేసారు. "బాబా" కొరకు ఏర్పాటు చేసిన ఆనాటి అలంకరణలో పూవుపూవున, రేకురేకున భక్తియనే సుగంధము, ఘుమఘుమలు వెల్లడైనవి. డా॥ శ్రీనివాసులరెడ్డిగారి గృహము నుంచి గురుబంధువులందరూ రాత్రి 11గంటలకు చేరినారు. **గురువుగారే పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకనేనేమో మా అందరిలో భక్తిపారవశ్యము మోసులెత్తింది. ఆనాటి వారి పూజావిధానము ముద్దుకొల్పింది, ముచ్చటేసింది, మురిపెము కల్గించినది. దాస్యభక్తికి ఉదాహరణగా వారిని చెప్పవచ్చును. బాబా అంటే వారికెంతో ప్రేమ, పరిశుభ్రము చేయు సమయమున వారి శ్రద్ధ, నమస్కరించే సమయంలో భక్తిభావశబలత, ఆరతినిచ్చే సమయాన హృదయములోని వారి ఆనందము, బాబాకు సాష్టాంగపడి నమస్కరించే శరద్బాబుగారిని చూచి సాధకులు నేర్వవలసిన సాధనా రహస్యాలు ఎన్నో ఉన్నాయని అనిపించింది. చక్కని స్వరముతో బాబా అష్టకము, మంత్రపుష్పమును గురువుగారు చదువుతుంటే కోనసీమలోని వేదసభలా ఉంది నాకు.** స్పష్టోచ్ఛారణ కల్గిన మంత్రోచ్ఛారణ వింటే వేదముపైన గూడా వీరికి అధికారముందే! అని భావించాను. పాల్గొనిన కొద్దిమందిలోను ఏదో తెలియని భావసంతృప్తి,



హృదయశాంతి తొంగిచూచినది. గురువుగారు బాబా నామాన్ని చెపుతూ వారు భజన చేస్తూ మా అందరిచేత చేయించారు. గురుదేవులు మొదటి సాయిపూజా మహోత్సవాన్ని మరపురాని, మరచిపోలేని మధురానుభూతిగా మిగిల్చినారు మా అందరికి. వారు ముందు కూర్చొని గత సంవత్సరాలను అధ్యయనం చేస్తూ సింహావలోకనం చేస్తే ఈ జన్మలో ఇంతవరకు సాధించినది ఆవగింజంతైనా ఉందా? ఏఏ వాసనలు నన్ను అంటిపెట్టుకొని ఉన్నాయో ఊహించలేకపోయాను.

**తెలవారలేదు. 2.30 దాటిందనుకుంటాను. మా అమ్మ, చల్లని తల్లి, అమృతహస్తమున్న అనసూయమ్మగారు వచ్చిన మా అందరికోసం వేడి వేడిగా భోజనాలను తయారు చేస్తున్నారు. నాకు బాగా గుర్తుంది.** నూనెతో గుత్తి వంకాయలను స్పెషల్‌గా తయారు చేసారు. గుప్తాగారికి నూనెతో గుత్తివంకాయ అంటే ఎంతో ఇష్టము. నన్ను భోజనానికి రమ్మని మొదట ఎస్‌విఎల్‌గారు పిలిచారు. ఆ తరువాత గురువుగారు కూడా రమ్మనినారు. అమ్మగారు కూడా పిలిచారు. అభిజాత్యపు వాసనలు అణువణువున నిండిన నాకు, రక్తంలో కులాభిమానం, శుద్ధ వైదికాచారం తలకెక్కించుకొనిన నాకు, నేను అప్పుడేం పోగొట్టుకొనుచున్నానో తెలియదు. కోల్పోయిందేమిటో తెలియదు. అప్పటికి నేనింకా బాబా భక్తుడనేనా? బాబా మార్గములో నడుస్తున్నానా? అన్న ఆలోచనలు గురుదేవుల సాహచర్యములో కలిగినవి. గురుదేవుల సత్సంగం, వారి బోధనలు నన్ను క్రమక్రమంగా మార్చినవి. అయితే గురువుగారు ఏనాడూ వేదాంత బోధనలుగాని, ప్రసంగాలుగాని చేసేవారు కారు. బాబాను గూర్చిన విషయాలే చెప్పేవారు. శ్రమనేది లేకుండా, అలుపన్నది రాకుండా గంటలు, గంటల తరబడి రాత్రి, పగలను వ్యత్యాసము లేకుండా చెప్పేవారు. బాబా మార్గమువైపుకు పయనించడానికి దోహదపడినది వారి మాటలే. ఏఏ పనులు బాబా ఇష్టపడతారో, ఏఏ పనుల వల్ల బాబా మనపై వర్షించే అనుగ్రహాన్ని అర్థం చేసుకోగలుగుతామో, బాబాను ఋణానుబంధముతో బంధించడమెలాగో చెప్పారు. మొదట ఈ బోధనలు నచ్చినవి. బాబా తన సమీప భక్తులనందరినీ ఎలా చూచారో చెప్పారు. కులానికిగాని, కులాభిమానానికిగాని ఆయనెన్నడూ ప్రాధాన్యమీయలేదు. అందుకనే గదా! వారి కులగోత్రాలుగాని, వంశాది విషయాలుగాని, తల్లిదండ్రులను గూర్చిగాని గోప్యంగా ఉంచినది. ఇందులో ఏ ఒక్కటి వెల్లడైనా బాబాను ఒక వర్గానికి చెందినవారు మాత్రమే ఆరాధించేవారు. "మహాత్ముడంటే" అన్ని వర్గాలవారు, అన్ని కులాలవారు, అన్ని మతాలవారు పూజించేలా ఉండాలి. చూడండి "తాజుద్దీన్ బాబా" గొప్ప ఔలియా.





అన్న ఎరుక ఉంటే చాలు. ఆ ఎరుక లేకపోయినా పర్వాలేదు, ఇబ్బందేం లేదు. ముందు మీలో బాబాను చూడటానికి ప్రయత్నించండి, తరువాత అందరిలో ఉన్న బాబాను చూడటానికి ప్రయత్నిద్దాం. మనలో ఉన్న బాబానే చూడలేనప్పుడు, ఇతరులలో ఉన్న బాబాను ఏం చూడగలం? ప్రతి జీవిలోనూ బాబా ఉన్నప్పుడు, ఆయన మనలో మాత్రం ఉండరా? ఆయన మనలోనే ఉంటే, ఆయన మనలో ఎలా ఉన్నారు? ఎక్కడ ఉన్నారు? ఎక్కడ దాగి ఉన్నారు? దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ఆ తర్వాత అందరి హృదయాలలో ఉన్న బాబాను తెలుసుకోవడానికి ప్రయత్నించవచ్చు.

"అన్ని జీవులలోనూ నేను ఉన్నాను" అని బాబా చెప్పింది నిజమే అయితే, అసలు మన హృదయం ఆయన ఉండటానికి అనువుగా ఉందా? కాబట్టి ముందు హృదయాన్ని శుభ్రం చేసుకోండి. ఎలాగైతే నేను వచ్చినప్పుడు, ఫ్లాట్ అంతా శుభ్రం చేసి, పూలు పెట్టి సిద్ధం చేస్తారో అలాగే మీ హృదయాన్ని కూడా సిద్ధం చేసుకోవడానికి ప్రయత్నించండి.

**భక్తుడు** : మరి హృదయాలను ఎలా శుభ్రపరచుకోవాలి?

**గురువుగారు :** నేను వచ్చినప్పుడు మీరు ఈ ఫ్లాట్‌ని (ఇంటిని) ఎలా శుభ్రం చేస్తారు? ఎలా ఉంటే నాకు ఇష్టమో మీకు తెలుసు. ఉదాహరణకు మస్కిటో రిపెల్లెంట్ (దోమల నివారణ మందు) నాకు పడదని మీకు తెలుసు కాబట్టి మీరు ఆ చుట్టుప్రక్కల అటువంటివేమీ లేకుండా చూస్తారు. ఇలాంటివి చాలా విషయాలు ఉన్నాయి. బాబాకు ఇష్టమైనవి ఏమిటో మీకు తెలుసు. ఆయనకు ఇష్టంలేని వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నించండి. మీరు వాటిని తొలగించుకుంటే, అప్పుడు బాబా వచ్చి ఆనందంగా మీ హృదయాలలో ఉంటారు. అప్పుడు మీరు ఆయనను ప్రతిరోజూ చూడవచ్చు, నచ్చినప్పుడు మాట్లాడవచ్చు, దర్శించవచ్చు. బాబా వచ్చి (గురువుగారు తమ హృదయంకేసి చూపుతూ..) ఇక్కడ, మీ స్వంత ఫ్లాట్‌లో ఉంటారు.

**భక్తుడు** : గురువుగారూ, మిమ్మల్ని వీలైనన్నిసార్లు దర్శించుకోవాలని ఉంటుంది. మీరు అలా నడిచి వెళుతున్నప్పుడు (దర్శన సమయంలో) మీరు ఆగి నా వైపు చూడాలంటే నేనేం చేయాలి?

**గురువుగారు :** మనం ఒక పూతోటలో నడుస్తున్నప్పుడు పువ్వులు తాజాగా ఉంటే కాసేపు నిలబడి చూడాలను కోవటం సహజం. ఆ పూలలోని తాజాదనం పోతే, ఇక అక్కడ చూడటానికి ఏముంటుంది? అందుకని మీరు ఆ వాడిపోయిన పువ్వుల్లా ఉండవద్దు. ఎప్పుడూ ఆ తాజాదనాన్ని నిలుపుకోండి.



లేదు. లేదూ, మీకు దాన్ని పెంచుకోవాలని లేకపోయినా, కనీసం ఇతరులను ఇబ్బంది పెట్టకుండా ఉన్నా చాలు.

మీరు ఇక్కడ ఏ లక్ష్యంతో ఉన్నారు అనే దానిమీదనే అంతా ఆధారపడి ఉంటుంది. సాధారణంగా అందరూ ఆ విషయాన్ని మర్చిపోతారు. ఒకవేళ నేను మీకు, "మీరు ఇలానే నడుచుకోవాలి" అని చెప్పాననుకోండి. అది ఒక తంతులాగా మారుతుంది. అప్పుడు దానివల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. మీరన్నట్లు, దివ్యానుభూతికి, ఐహిక జీవితానికి తేడా ఉంది. కానీ, దర్శన సమయంలోని ఆ అనుభూతిని ఎంతగా వీలైతే అంతగా నిలుపుకొని ఆ తేడా లేకుండా చేసుకోవడమే మన లక్ష్యం. మనకు ఇక ప్రాపంచిక జీవితానికి, పారమార్థిక జీవితానికి తేడా అనేది కనిపించకూడదు. అప్పుడు ప్రాపంచికం పారమార్థిక మవుతుంది, పారమార్థికం ప్రాపంచికంగా అనిపిస్తుంది. ఆ అత్యున్నత భావోద్వేగస్థితిలో అంతా ఒకటిగానే ఉంటుంది. **ఎవరైనా నా దగ్గరకు వస్తే అది బాబా సంకల్పమే, నా సంకల్పం కాదు.** నాకు సాధ్యమైనంత మేరకు వారిని దూరంగా ఉంచడానికే ప్రయత్నిస్తాను (నవ్వులు....) అయినా కూడా వాళ్ళు వచ్చారంటే, వారిని నా దగ్గరకు తీసుకొని వచ్చేది బాబా మహిమే, నేను దానిని ఆనందంగా తీసుకుంటాను. నేను వారిని చూసినప్పుడు నాకు బాబా మహిమ కనబడుతుంది, వారిలో నేను బాబాను చూస్తాను.

ఎప్పుడూ నాకది పురుష సూక్తంలో చెప్పిన "సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్" అనే శ్లోకాన్ని గుర్తుకు తెస్తుంది. సహస్ర శిరస్సులు, సహస్ర కరములు, సహస్ర పాదాలు కలిగిన ఆ పురుషుడు, ఆ బాబా నాకు దర్శనం అనుగ్రహించడానికి వచ్చినట్లు అనిపిస్తుంది. నాకు అది ఆనందానుభూతినిస్తుంది. నేను ఒకరికి సాయం చేస్తున్నాను అనే భ్రమ నాకు లేదు. బాబా లీలలను నేను ఆస్వాదిస్తున్నాను. అంతే! నేను నిజం చెబుతున్నాను, మీకు సాయం చేసేది బాబానే, నేను కాదు.

**భక్తుడు** : గురువుగారూ, అన్నింటిలోనూ బాబాను చూడటం ఎలా?

**గురువుగారు :** నేను మిమ్మల్ని అన్నింటిలోనూ బాబాను చూడమని చెప్పడం లేదు. "అన్ని జీవులలోను నేనున్నాను" అని బాబా అన్నారు. అది గుర్తుపెట్టుకుంటే చాలు. మన మనసులో బాబా పట్ల ఉండే భావనను ఇతరులమీద ఆపాదించడానికి ప్రయత్నం చేస్తూ బాబా, బాబా, బాబా అనడం కాదు. అది కాదు (నవ్వులు...) మనం ఇతరులతో వ్యవహరిస్తున్నప్పుడు ప్రతి ప్రాణిలోనూ బాబా ఉన్నారు





ఎందరు హిందువులు, ఎంతమంది క్రైస్తవులు వారిని పూజించగలుగుతున్నారు. క్రీస్తును ఎంతమంది ముస్లింలు, ఎంతమంది హిందువులు ఆదరించగలుగుతున్నారు. "రామకృష్ణ పరమహంస" వంటి మహాత్ములను, ఎంతమంది క్రైస్తవులు, ఎంతమంది ముస్లింలు పూజించగలుగుతున్నారు. అలా పూజించలేకపోవడానికి కారణం వారంతా ఒక మతానికి చెందినవారుగా ప్రకటితమైనారు. అందుకనే "బాబా" తన కులమేమిటో, మతమేమిటో మొ॥ విషయాలను వెలికి రానీయలేదు. హిందువులుగాని, క్రైస్తవులుగాని, మహమ్మదీయులుగాని, సిక్కులుగాని, ఇంకా ఎవరైనాగాని ధరిస్తారు. హిందువులకని ఒక బంగారము, ముస్లింకని మరో బంగారమని ఎలా ఉండదో, "మహాత్ముడంటే" అందరికీ మహాత్ముడుగానే పూజించాలి. అలాంటివారిలో మన బాబా ఆద్యులని చెప్పాలనినారు. ఈ మాటలు నాలో కొంత పరివర్తన తెచ్చినవి. రక్తములో కల్సిన విషాన్ని డాక్టరు వేరుచేసి రక్తాన్ని శుద్ధి చేసి, కలుషితాన్ని తీసివేసినట్లుగా ఉపకరించింది. నా జాత్యాభిమానంపై, దురభిమానంపై వారి బోధ. మరోబోధ షిరిడీలోనే జరిగింది. గురుదేవుల ముందు దాదాపుగా 20 మంది ఉన్నారు. వారిలో ఈ అనామకునికి గూడా గురువుగారు అదృష్టాన్నిచ్చారు. చాలా విషయాలు చెప్పి సాధనా మార్గంగా కొందరు ముందుకు సాగాలని ప్రయత్నిస్తారు. మంచి ఆలోచనే కాని ఎలా ప్రయాణించాలో తెలియక తికమక పడుతుంటారు. పాతవాటిపై మమకారం పెంచుకొని ముందుడుగు వేయటానికి వెనుకంజ వేస్తారు. ఎలాగంటే, మేడ పై భాగమునకు చేరాలంటే మెట్లను కట్టుకుంటాము. ఒకటో మెట్టెక్కితేనే రెండోమెట్టు ఎక్కగలిగేది. రెండోమెట్టును దాటితేనే మూడోమెట్టు నెక్కుతాము. అలా పై మేడకు చేరడానికి ఈ మెట్లను ఉపకరణాలుగా ఉపయోగించు కుంటున్నామన్నమాట. పై మెట్టెక్కాలంటే క్రిందిమెట్టును వదిలి వేయవల్సిందే. నీకింకా క్రింది మెట్టుపై మోజుంటే పైకి వెళ్ళాలన్నా వెళ్ళలేవు. అక్కడే ఉంటావు. ఆధ్యాత్మికతలోనూ అంతే.

**మరో ఉదాహరణ :** 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఎలిమెంటరీ స్కూల్‌లో చదివినవాడు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు హైస్కూల్లో చదువుతాడు. ఆ తరువాత జూనియర్ కళాశాల, ఆ తరువాత ఉన్నత కళాశాల ఆ పిమ్మట విశ్వవిద్యాలయములో అధ్యయనం చేయగలుగుతాడు. అంటే 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు నీవు విద్యాపరంగా సాగించిన 5 సం॥ల సాధన నిన్ను హైస్కూల్‌కు చేర్చినది. ఆ తరువాత 5 సం॥ విద్యాపరమైన సాధన నిన్ను కళాశాల స్థాయిదాకా ఎలాగైతే తీసికొని వెళ్ళినదో అలాగే నీ జీవితంలోని నీ ఆధ్యాత్మిక సాధన కూడా నిన్ను ఒక తరగతి నుండి ఒక తరగతికి మార్చిందన్న మాట. అంటే బాబా సన్నిధికి రాకముందు మీరు మీ జీవితంలో



సాగించిన సంధ్యావందనాలు, దేవతా ఉపాసనలు, మొదలగు భక్తి మార్గముల ఫలమంతా ఫలించి నిన్ను "బాబా" అనే విశ్వవిద్యాలయంలోకి తీసికొని వెళ్ళినవి. వాటి కర్తవ్యమంత వరకే. నీ సాధనకు మరింత పరిపక్వత గలగాలంటే "బాబా" అనే ప్రొఫెసర్ ఏర్పాటు చేసిన కోర్సును చదవాల్సిందే. ఆ కోర్సును చదివిన తరువాతే గదా! నీ రిజల్ట్సును చెప్పి "డిగ్రీ" ఇచ్చేది. ఆరవతరగతిలో ఎక్కాలపుస్తకం చదువుతాము. డిగ్రీలో చేరిన తరువాత కూడా ఎక్కాలపుస్తకాన్ని వెంట తెచ్చుకుంటామా? ఎక్కాలు చదవకుండానే ఇంత వాడినైనానని కృతజ్ఞతా సూచికంగా ఎక్కాల పుస్తకంతోపాటు చిన్నప్పటి పెద్దబాలశిక్ష, తెలుగువాచకము, మొదలగు పుస్తకాలను తెచ్చుకుంటే కాలేజీ కుర్రాళ్ళు నిన్ను వింతగా చూస్తారు. వెర్రివానిగా భావిస్తారు. నీకు మొదట ఉన్నత లక్ష్యంవైపుకు పయనించాలనే లక్ష్యం ఉండాలి. అపుడే దానికి సంబంధించిన గమ్యంవైపుకు పయనించగలుగుతావు. నీ లక్ష్యం "బాబా" అనుగ్రహమే అయితే సాయిపథ మార్గంలో పయనించాల్సిందే. నీ గతమందలి ఆధ్యాత్మిక అంశాలు నీ ఉన్నతికి వేసిన సోపానాలు అంతే.

బాబా కులానికి మతానికి ప్రాధాన్యమిచ్చారా? మొదటి అధ్యాయంలో భోజనం చేయమని ఆహ్వానించగా నిరాదరణ చేసినవారి గతి ఏమైందో మనకు బాబా చెప్పారు గదా! అందుకే గురుబంధువుల ఆహ్వానాన్ని అంగీకరించాలనినారు. పై విషయాలు 'పిలిగ్రిం ఇన్'లో గురువుగారు అందర్నీ ఉద్దేశించి చెప్పినా 'అవి నాకే' అని నాకనిపించింది. ఆ తరువాత ఆగస్టులో గురువుగారు ఒంగోలుకు వచ్చారు. "నేనూ వెళ్ళాను" గురుదేవుల అనుమతి కోసం వెళ్ళాను. ఈ ఊరిలో మా బంధువులున్నారు. వెళ్ళి పలకరించి వస్తానన్నాను. అలాగే, కాని భోజనానికి ఇక్కడికే వస్తావుగదూ! అన్నారు. ఆ నవ్వులో ఎన్ని వ్యంగ్యములు దాగి ఉన్నాయో నాకు తెలుసు. ఎక్కడ నొక్కారో తెలుసు, ఎక్కడ పాశమేశారో తెలుసు. ఆ నవ్వు గురించి అందులోని అంతరార్థాన్ని గురించి మరో 50 పేజీలు రాసినా మిగిలే ఉంటుంది. తలవంచుకొని పాదాలు పట్టుకొని, "చచ్చినపామును ఇంకా చంపొద్దు" బుద్ధొచ్చింది. ఇక్కడే భోజనం చేస్తా! అన్నా వినయంగా. ఇదీ నన్ను సంస్కరించిన తీరు. చర్మం వలిచివేయటమంటే మన ఆధ్యాత్మిక సాధనకు, బాబా అనుగ్రహమునకు దూరము చేసే పొరనే గురువుగారు చర్మమని వ్రాసి ఉంటారు. అలాంటి పొరలెన్ని ఉన్నాయో మనలో ఆ మహనీయుని శరణుజొచ్చిన మరుక్షణములోనే మన వాసనలను పొలుసులను అరగదీసి, అహంకారపు పొరలను, వారి అనురాగమును చేతితో లాగి వేస్తూ, మనలనందరినీ బాబాపథంవైపుకు పయనించేలా చేస్తున్నారు.

– డా॥ ఎస్.సాయివరప్రసాదరావు





కానీ కనీసం రవ్వంతైనా అర్థం చేసుకోవడానికి నేను ఒక ఉదాహరణ ఇస్తాను. అప్పుడే పుట్టిన తన బిడ్డను తల్లి చూసే చూపు ఎలా ఉంటుందో ఊహించండి. అప్పటివరకు ఆ బిడ్డ ఆమెలో భాగం, ఆమె శరీరంలో ఒక భాగం, ఆమె నుండి వేరు కాదు. బిడ్డ పుట్టగానే ఆ తల్లి చూసే మొదటి చూపు ఎలా ఉంటుందంటే, తనలోని భాగాన్నే తాను చూసుకుంటున్నట్లుగా ఉంటుంది. బిడ్డ ఏడుస్తుంది, పాలు కోరుతుంది... నెమ్మదిగా వాళ్ళ మధ్య ఇంటరాక్షన్ మొదలవుతుంది. క్రమేణా ఆ చూపులో తొలి అనుభూతి, గాఢత, ఏకత్వానుభవం తగ్గిపోతాయి.

**ఏ చూపు అయితే అన్నింటినీ, అందరినీ తనలోని ఒక భాగంగా చూడగలదో అదే దివ్యదృష్టి.** దేనిని చూసినా "అది కూడా నేనే, నాకంటే వేరు కాదు" అని అనుభూతి చెందుతూ, అలా చూడగలగడాన్ని హంస, సోహం అంటారు, సో–అహం అంటే "అది నేనే". అది ఏదైనా కానివ్వండి, అదీ నేనే.

**భక్తుడు** : సాధారణమైన లౌకిక ప్రపంచానికి, దివ్యమైన క్షణాలలో (దర్శన సమయంలో) మేము చూసే ప్రపంచానికి గల పరస్పర వైరుధ్యం నాకు ఆసక్తిగా, చిత్రంగా అనిపిస్తుంది. దర్శన సమయంలో మేమంతా ఎంతో భక్తి ప్రపత్తులతో ఉంటాము, దర్శనం అయిపోగానే లౌకిక జీవితం తిరిగి మొదలవుతుంది.

**గురువుగారు :** అది మంచిదే, కనీసం ఆ కొన్ని నిమిషాలైనా మనం ఆ దివ్యత్వాన్ని అనుభూతి చెందగలుగుతున్నాము. మనం ఎంత మేర లౌకికంగా, ప్రాపంచికంగా ఉంటామో అంతగా మనకు ఆ వైరుధ్యము, తేడా తెలుస్తుంది.

**భక్తుడు** : దర్శన సమయాలలో అనుభవమయ్యే ఆ దివ్యత్వాన్ని మా ప్రాపంచిక జీవితంలో ఎలా అనుభవంలోకి తెచ్చుకోవాలి?

**గురువుగారు :** అదంతా మీరు ఇక్కడ ఎందుకున్నారు అనే అంశం మీద ఆధారపడి ఉంటుంది. దర్శన సమయంలో ఆ కొద్దిక్షణాలపాటు మీకు అనుభవమయ్యే దానిని మరింతగా అనుభవంలోకి తెచ్చుకోవడం మీ లక్ష్యమయితే, దానిని సాధ్యమైనదంత ఎక్కువ సమయం నిలుపుకోవడానికి ప్రయత్నించండి. ఆ అనుభూతిని పెంచుకోవడానికి రకరకాల వ్యక్తులకు రకరకాల మార్గాలు, పద్ధతులు ఉంటాయి. దానిని పెంచుకోవడానికి, "ఇదీ మార్గం, అదీ మార్గం" అని ఒక ప్రత్యేకమైన మార్గమంటూ



**భక్తుడు** : గురువు మాపై దృష్టి సారించకపోతే మేము ఆయనను చూసినా అది నిజమైన దర్శనం కాదు కదా!

**గురువుగారు :** (గురువుగారు కళ్లు పెద్దవి చేసి సూటిగా చూస్తూ...) గురువు ఈ విధంగానే మిమ్మల్ని చూడాలా? (నవ్వులు...) కాదు! ఆయనకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. మనం ఆయనను ఒక విధంగానే చూడగలం. కానీ ఆయన మనల్ని చూడటానికి వెయ్యి విధాలున్నాయి.

**భక్తుడు** : ఎంత గొప్పగా ఉంది, గురువుగారూ!

**గురువుగారు :** మనకు కేవలం రెండు కళ్ళు మాత్రమే ఉన్నాయి. కానీ బాబాకు వేలాది కళ్ళు, లెక్కలేనన్ని కళ్ళు.

**భక్తుడు** : గురువుగారూ, ఇందాక మీరు అలా "కావడం" (becoming) గురించి చెప్పారు. అది హామీనా?

**గురువుగారు :** అవును, అది రాజీ లేని ఖచ్చితమైన హామీ.

**భక్తుడు** : గురువుగారూ, దివ్యదృష్టి అంటే ఏమిటి?

**గురువుగారు :** **ప్రతిదానిలో దివ్యత్వాన్ని దర్శించగలిగేదే దివ్యదృష్టి.** సద్గురువు అంతటా దివ్యత్వాన్ని దర్శిస్తారు. అందుకనే ఆయన చూపు దివ్యమైనది. మీరు ఆయనను దివ్యస్వరూపంగా చూడగలిగితే, అది కూడా దివ్యదృష్టే.

**భక్తుడు** : సద్గురువు మనల్ని ప్రేమించినట్లుగా మనం వారిని ప్రేమించగలమా?

**గురువుగారు :** అవును, ప్రేమించగలం. ఆయనతో మీరు ఒక్కటయినప్పుడు అది సాధ్యమవుతుంది. అయినా ఆయన మనల్ని ఎందుకు ప్రేమించాలి? ఆయన మనల్ని అంతగా ప్రేమించడానికి మన దగ్గర అంత ప్రత్యేకమైన విషయమేదైనా ఉందా? ఏమీ లేదు. ప్రతి మనిషి అన్నింటికన్నా ఎక్కువగా తనను తానే ప్రేమించుకొంటాడు. మన పరిమితమైన అస్తిత్వం వల్ల మనలో అనేక భావాలు కలుగుతాయి. అది ప్రేమో, ద్వేషమో, మరొకటో, మరొకటో. కానీ సద్గురువు మాత్రం అన్నింటిలోనూ తమను తామే చూసుకుంటారు. మనకు ఆయన మనల్ని ప్రేమిస్తున్నట్లు కనిపిస్తుంది. కానీ ఆయనకు మాత్రం తమను తామే ప్రేమించుకుంటున్నట్లు ఉంటుంది. ఆయన సమస్తాన్ని తమ స్వరూపంగా చూస్తారు. ఆయన చూపే దానికి నిదర్శనం.

ఆ చూపును వర్ణించడానికి సరైన ఉపమానంగానీ, ఉదాహరణగానీ ఖచ్చితంగా ఇవ్వలేము.






## సద్గురు సమ్మోహనం - సాయినామ జగన్మోహనం

నేను కూడా అందరిలాగా నామం చెప్పాలి అనే నా మొదటి కోరికను గురువుగారు తీర్చటంతో నాకు అనిపించింది. ఓహో! ఈయన రెస్పాన్స్ బాగానే ఉంది. కాబట్టి ఇంకొక కోరికను ఇంకా కొంచెం బెటర్‌గా అడుగుదాము, అని ఆలోచన వచ్చి ఇంకో కోరికను గురువుగారికి విన్నవించుకున్నాను. అది ఏమిటంటే "గురువుగారు స్టేజి మీదకు వచ్చి దర్శనం ఇచ్చినపుడు నామం చెప్పాలి" అది అసాధ్యమైన కోరిక. అక్కడ ఉన్న చాలా మంది గురుబంధువులను నేను "అయ్యా, గురువుగారు స్టేజి మీదకు వచ్చినపుడు నేను భజన చెప్పవచ్చునా, అని అడిగితే, మీరు క్రొత్తవాళ్ళు, మీకు ఇవ్వరు. నలుగురు, ఐదుగురు ఉన్నారు. వాళ్ళు బాగా నామం చెపుతారు. గురువుగారు వచ్చినపుడు వాళ్ళే చెబుతారు. అయినా మీరు దీని గురించి నారాయణరావుగారిని అడిగి చూడండి అన్నారు. కానీ నేను గురువుగారితో, "స్వామీ, నేను నారాయణరావుగారిని కానీ, ఇంకెవరినిగానీ, అడగదలచుకోలేదు. మీరు స్టేజి మీదకు వచ్చి దర్శనం ఇచ్చి, ధ్యానంలో ఉన్న ఆ పదినిమిషాలు నాకు నామం చెప్పాలని కోరిక కలిగింది" అని చెప్పుకున్నాను.

నేను మామూలుగా గురువుగారు దర్శనం ఇచ్చే సమయంలో ముందువరుసలోనే కూర్చునేవాడిని. ఆరోజు కూడా ఎప్పటిలాగానే ముందు కూర్చున్నాము. గురువుగారు వచ్చి సాయిబాబాకు నమస్కారం చేసుకుంటున్నారు. నేను గురువుగారివైపే చూస్తున్నాను. ఇంతలో ఎవరో ఒకాయన వచ్చి నా ముందు మైకు పెట్టి, ఈ రోజు మీరు చెప్పండి సార్ నామం అని చెప్పాడు. నేను స్టన్ అయిపోయాను. అయ్యో, ముందు తెలిసుంటే ఫలానా రాగంలో నామం చెప్పాలి అని సెట్ చేసుకొని గురువుగారి దగ్గర బాగా చెప్పడానికి అవకాశం ఉండేది. సడన్‌గా ఇచ్చేసారు. కానీ ఈనాటికీ తెలియదు నాకు ఆరోజు మైకు పెట్టింది ఎవరు అనేది. అతను అలా సడన్‌గా మైకు పెట్టేసరికి నాకు కొంచెం తడబాటు వచ్చింది. గురువుగారు బాబాకు నమస్కారం చేసుకొని వచ్చి కూర్చున్నారు. అయితే నేను ఈ తడబాటు వలన ఒక 10, 20 సెకన్లు నామం మొదలు పెట్టడానికి ఆలస్యం అయింది. మామూలుగా ఎప్పుడూ చెప్పేవాళ్ళు అందరూ ఠక్కున నామం ప్రారంభిస్తారు. కానీ, నేను కొత్తవాడిని. అందులోనూ షాక్‌లో ఉన్నాను. ఆయన ఇంత త్వరగా ఇస్తారని అనుకోలేదు. కోరిక అడిగిన ఏ పదిరోజులకో ఇస్తారులే అనుకున్నాను. కానీ అడిగిన రెండవరోజు లేదా మూడవరోజున అవకాశం ఇచ్చారు. నేను నామం చెప్పడానికి కొంచెం లేట్ అయ్యేసరికి గురువుగారు ***(మిగతా 23వ పేజీలో)***



# దర్శనం *జనవరి 2014*



**భక్తుడు :** గురువుగారూ! నేను దర్శనం గురించి కొన్ని ప్రశ్నలు అడగాలనుకొంటున్నాను. నా అవగాహన ప్రకారం, దర్శనం అంటే సద్గురువునుగానీ లేదా భగవంతుని రూపాన్నిగానీ 'చూడటం'. అసలు ఈ 'చూడటం' అంటే ఏమిటి? మనం పొందే ఫలితం ఆ చూసే విధానంలో ఉందా? లేక ఆ సద్గురువు మనల్ని చూడటంలో ఉందా? ఆ సద్గురు రూపాన్ని ఎన్నడూ మరచిపోకుండా మన మనస్సులో పదిలపరుచుకోవడానికి ప్రయత్నించాలా? లేక ఆ సద్గురు సాన్నిధ్యంలో ఉన్నప్పుడు మనం పొందే అంతర్గతమైన అనుభూతి మీద మనస్సు లగ్నం చేయాలా? దర్శనసమయంలో మరింత ఫలితం పొందడానికి మార్గమేమిటి?.... ఇలాంటివి నాకెన్నో ప్రశ్నలున్నాయి.

**గురువుగారు :** ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమివ్వడానికి, మీకు బాగా అర్థమవడానికి నేను ఒక ఉదాహరణ ఇస్తాను. మీరు సినిమా చూస్తున్నారు, మీరు కేవలం తెరమీద కదలాడే బొమ్మలను మాత్రమే చూడటం లేదు, "నేను సినిమా చూస్తున్నాను" అంటారు. కానీ నిజంగా అక్కడ జరిగేది ఏంటంటే – నీకు, ఆ సినిమాకు మధ్య ఒక రకమైన ఇంటరాక్షన్ జరుగుతూ ఉంటుంది. నువ్వు తెరమీద పాత్రలలో లీనమై నవ్వుతావు, ఏడుస్తావు, నిరాశపడతావు, కోప్పడతావు లేదా నీకు విసుగు పుట్టవచ్చు కూడా! "నేను సినిమా చూస్తున్నాను" అని మీరు అనవచ్చు, కానీ మీరు నిజానికి కేవలం చూడటమే కాదు, దానిని అనుభూతి చెందుతున్నారు. మీరు సినిమాను చూస్తున్నట్టే బాబాను కూడా చూస్తారు – అదే దర్శనం అంటే, అంతే! మీరు కేవలం చూడటం మాత్రమే కాదు, మరేదో అనుభవాన్ని పొందుతున్నారు.

**భక్తుడు** : మిమ్ములను దర్శించుకునే సమయంలో మేము మరింత అనుగ్రహాన్ని ఎలా పొందాలి?

**గురువుగారు :** మీరు మరింత పొందడమెలాగో నాకు తెలియదు కానీ నేను వచ్చేది మాత్రం మీ దర్శనానికే! నేను సత్సంగహాలుకు దర్శనం ఇవ్వడానికి రావడం లేదు, దర్శనం చేసుకోవడానికి వస్తున్నాను. అవును, నా అనుభవం అది. అది నాకెంతో సంతోషాన్నిస్తుంది.

ఒకరికి దర్శనమిచ్చేందుకు నేనెంతవాణ్ణి? మహిమాన్వితమైన సాయినాథుని సన్నిధే మనల్నందరినీ భక్తి, ప్రేమలతో ఆయన దర్శనానికి ఆకర్షిస్తుంది. మనందరికీ సర్వదా బాబానే దర్శనీయుడు. అంతమంది సాయిభక్తుల ముందు కూర్చున్నప్పుడల్లా నాకు "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్" అన్న వేదసూక్తం స్ఫురణకు వస్తుంది. సహస్ర శిరస్సులతో, సహస్రనేత్రాలతో శ్రీసాయి తమ విరాట్ స్వరూపంతో దర్శనమిచ్చి, ప్రసన్నదృష్టితో చూస్తున్నారనిపిస్తుంది. ఆ విరాట్ స్వరూపాన్ని దర్శనం చేసుకోవటమే నేను చేసేది!



**భక్తుడు** : సద్గురువు యొక్క దృష్టి గురించి – ఆ దృష్టి యొక్క విశిష్టత గురించి ఎందుకంత గొప్పగా చెప్పబడుతుంది?

**గురువుగారు :** ఎందుకంటే అది ప్రేమను తెలియచేస్తుంది కాబట్టి. గురువు ద్వారా వ్యక్తమయ్యేది ప్రేమ, మీకు గురువు పట్ల ఉండేది ప్రేమే. ఆయన చూపు మిమ్మల్ని ప్రేమతో ముంచెత్తుతుంది. ఆ చూపులో ఉండేది ఆ ప్రేమే. ఆ చూపుకు విలువనిచ్చేదీ ఆ ప్రేమే. మన కరెన్సీ నోటు మీద గవర్నర్ సంతకం లాంటిది ఆ ప్రేమ. (గురువుగారు నవ్వుతూ...) నిజానికి అది చూపు మాత్రమే కాదు, మరేదో కూడా జరుగుతూ ఉంటుంది; ఒక రకమైన ఇంటరాక్షన్ (పరస్పర స్పందన) జరుగుతూ ఉంటుంది.

ఆ ఇంటరాక్షన్‌కు మనం 'సినిమా చూడటాన్ని' ఒక మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. నా ఉద్దేశ్యం సినిమాలోని పాత్రలు మీతో వచ్చి మాట్లాడతాయని కాదు, కానీ అక్కడ ఏదో ఇంటరాక్షన్ జరుగుతూ ఉంటుంది. మీరు ఒక పాత్రతో తాదాత్మ్యం చెందుతారు. కేవలం సినిమా చూస్తున్నప్పుడే ఇటువంటి ఇంటరాక్షన్ జరుగుతున్నప్పుడు, వాస్తవంగా మీకు సమాధానమిస్తున్న బాబాతో మాత్రం అది ఎందుకు జరగదు? ఆ నిజాన్ని చూడలేకపోతే, సినిమా చూస్తున్నట్లయినా అనుభూతి చెందండి.

**చూడటం** (seeing), **ఉండటం** (being), **అనుభూతి చెందటం** (experiencing) **ఇవన్నీ కలిస్తేనే దర్శనం. అది కేవలం చూడటం మాత్రమే కాదు, ఎప్పుడైతే ఆ చూడటం జరుగుతుందో అప్పుడు అలా 'కావడం'** (becoming) **జరుగుతుంది.**

**భక్తుడు** : సద్గురువు మనల్ని చూడటం కూడా ఇందులో ఒక భాగమే కదా? కొన్ని గ్రంథాలలో మనం సద్గురువును చూడటం మాత్రమే కాకుండా, సద్గురువూ మనల్ని చూసినప్పుడే దర్శనం సంపూర్ణమవుతుందని చెప్పున్నట్లు ఉంటుంది.

**గురువుగారు :** అవును, ఆయన మనల్ని చూస్తూనే ఉన్నారు. అది సంపూర్ణం కాకుండా ఎలా ఉంటుంది?